



మనవడు దేవాన్ష్‌తో కలిసి పూజ చేస్తున్న సీఎం చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు



- ప్రమాదకరస్థాయిలో యూవీ కిరణాలు
- ఉమ్మడి గుంటూరుపై అతినీలలోహిత కిరణాల పడగ
- ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికంగా
- జాగ్రత్తలు తీసుకోకుంటే ముప్పేనంటున్న వైద్య నిపుణులు

10 యూవీ అంటే ప్రమాదకరమే

వాతావరణంలో అతినీలలోహిత కిరణాలు 2 యూనిట్ల లోపు ఉంటే సాధారణ స్థాయిగా గుర్తిస్తారు. 3 నుంచి 5 లోపు ఉంటే మధ్యస్థంగా, 6-7 మధ్య ఉంటే అధికంగా ఉన్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ గుర్తిస్తుంది. ఇక 8 నుంచి 10 వరకు ఉంటే అత్యధిక స్థాయిలో ఉన్నట్లు గుర్తించడంతో పాటు ప్రమాదకరమని రెడ్‌అలర్ట్ ప్రకటిస్తారు.



వణికిస్తున్న యూవీ కిరణాలు

రేడియేషన్... రెడ్‌అలర్ట్

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి నుంచి పగలు ఎండలు మండుతున్నాయి. రాత్రిల్లు మంచుతో పాటు చలిగాలులు వీచాయి. ఈ విచిత్రమైన వాతావరణ పరిస్థితులతో పలువురు అనారోగ్యాలకు గురయ్యారు. ఉన్నట్టుండి వాతావరణంలో చోటు చేసుకుంటున్న విపరీత మార్పులపై ప్రజల్లోనూ భయాందోళన నెలకొంది. ఈ వేసవిలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో అధికస్థాయిలో అతి నీలలోహిత కిరణాలు ఉన్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ గుర్తించింది. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్య ఈ కిరణాల తీవ్రత అధికంగా ఉంటోందని హెచ్చరికలు జారీ చేసింది. అతినీలలోహిత కిరణాల్లో ఉండే రేడియేషన్ మనుషుల్లో పలు రకాల ఆరోగ్య సమస్యలకు కారణమౌతుంది. ముఖ్యంగా వడదెబ్బ, సన్‌బర్న్స్, కంటి శుక్లాలు, చర్మం ముడతలు పడటం వంటి సమస్యలతో పాటు కొన్నిసార్లు చర్మ కేన్సర్లకు అతి నీలలోహిత కిరణాలు కారణమౌతాయి. యూవీ కిరణాల తీవ్రత అధికంగా ఉన్నప్పుడు జనాలు ఎండలో ఎక్కువ సేపు తిరిగితే సొరియాసిస్, బొల్లి రోగుల్లో ఎండ పడిన శరీర భాగాల్లో వ్యాధి వ్యాపించే అవకాశం ఉంటుంది. కొద్ది రోజులుగా పగటి వాతావరణంలో యూవీ కిరణాల తీవ్రత పెరుగుతోంది. ముఖ్యంగా గత మూడు రోజులుగా ఉమ్మడి గుంటూరు జిల్లా వాతావరణంలో 10 యూవీ రేడియేషన్ యూవీ కిరణాలు వెలువడినట్లు వాతావరణ శాఖ గుర్తించింది.

వీరు జాగ్రత్తగా ఉండాల్సిందే...

తక్కువ తరంగ దైర్ఘ్యం కలిగి ఉండటం వల్ల అతి నీలలోహిత కిరణాలు దృశ్యకాంతి కంటే అధికంగా చర్మలోతుల్లోకి చొచ్చుకొని పోగలవు. శరీర కణాల్లో డీఎన్‌ఏను దెబ్బతీసే సామర్థ్యం వీటికి ఉంటుంది. ఈ కారణంగా ఈ కిరణాల నుంచి రక్షణ కోసం బహిరంగ ప్రదేశాల్లో తిరిగే వారు, బైకర్లు, ఎండలో పని చేసే వారు, మత్స్యకారులు, పర్యాటకులు, కంటి, చర్మవ్యాధులు ఉన్న వారు, పిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లే సమయంలో పొడుగు చేతుల దుస్తులు, టోపీ ధరించడం, కళ్లద్దాలు ధరించడం శ్రేయస్కరమని వైద్యనిపుణులు చెబుతున్నారు. 'ఎండలో తిరిగే వారు సన్ స్క్రీన్ లోషన్ వాడనవసరం లేదు. శరీరంలో ఉండే మెలనిన్ రక్షణగా నిలుస్తుందని..' సీనియర్ డెర్మటాలజిస్ట్ డాక్టర్ డీవీఎస్‌బీ రామ్మూర్తి తెలిపారు. సొరియాసిస్, బొల్లి వంటి చర్మవ్యాధుల ఉన్న వారు ఎండలో ఉండే యూవీ కిరణాల్లో ఎక్కువ సేపు తిరిగితే వారిలో వ్యాధి తీవ్రత మరింత పెరుగుతుందన్నారు.

సన్‌బర్న్స్ కేసులు వస్తున్నాయి...



వాతావరణంలోని అతి నీలలోహిత కిరణాల తీవ్రత కారణంగా గుంటూరు ప్రభుత్వ సమగ్రా స్పత్రి చర్మవ్యాధుల వైద్య విభాగానికి సన్ బర్న్స్ రోగులు చికిత్సల కోసం వస్తున్నారు. ఎండలో తిరిగే వారు సూర్యరశ్మి చర్మంపై పడకుండా తగిన దుస్తులు ధరించాలి. అధికంగా మంచినీరు, ఇతర ద్రవ పదార్థాలు, యాంటీ ఆక్సిడెంట్ ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలి. ఎండలో తిరిగిన వారు అసౌకర్యంగా అనిపిస్తే వెంటనే నీడ పట్టున కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవాలి.

- డాక్టర్ లక్ష్మి, జీజీహెచ్ డెర్మటాలజిస్ట్

శాస్త్రోక్తంగా సీఎం ఇంటి భూమిపూజ

హోమం చేసిన సీఎం దంపతులు

లోకేశ్, బ్రాహ్మణికి పట్టువస్త్రాలు పెట్టిన రైతులు

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల వెలగపూడిలో తీసుకున్న స్థలంలో ఇంటి నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. అధికారిక హోదాలో ఎలాంటి హడావుడి లేకుండా పరిమిత సంఖ్యలోనే ఆహ్వానితులు, బంధుమిత్రుల సమక్షంలో శంకుస్థాపన జరిగింది. ఉదయం 7 గంటలకు ఉండవల్లిలోని ప్రస్తుత నివాసం నుంచి కుటుంబ సభ్యులంతా వెలగపూడిలోని తమ ఇంటి స్థలం వద్దకు చేరుకున్నారు. ఉదయం 8గంటల 51 నిమిషాలకు చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు, తమ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్‌తో కలిసి, పునాదుల్లో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, నిర్మాణాన్ని ప్రారంభించారు. మనవడు దేవాన్షును ఒళ్లో కూర్చోబెట్టుకుని సీఎం చంద్రబాబు క్రతువులు నిర్వహించారు.

● అపూర్వ స్వాగతం పలికిన రైతులు

ఇంటి శంకుస్థాపనకు వస్తున్న సీఎం కుటుంబ సభ్యులకు అమరావతి రైతులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. తమను ఆహ్వానిస్తే అందరూ రావాలనుకున్నామని, పరిమిత సంఖ్యతో కార్యక్రమాన్ని నిర్వహిస్తుండడంతో తామూ పరిమితంగానే రావాల్సి వచ్చిందని చాలామంది రైతులు వాపోయారు. అయినప్పటికీ తమ సంతోషాన్ని తెలియజేయడం కోసం అమరావతి మహిళలు రంగవల్లులతో ఆహ్వానం పలికారు. స్వాగత ద్వారం నుంచి హోమగుండం వరకూ ముగ్గులు వేసి, అందంగా రంగులు అద్ది నారావారి కుటుంబానికి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా లోకేశ్, బ్రాహ్మణి దంపతులకు రాజధాని రైతులు పట్టు వస్త్రాలు బహూకరించారు. చంద్రబాబు కొనుగోలు చేసిన స్థల యజమాని కంచర్ల సాంబశివరావు ఆయన భార్య, మాజీ సర్పంచ్ శాంతకుమారి, కుమార్తె గీత(చిన్న) ఇద్దరు యువ దంపతులకు పట్టు వస్త్రాలు పెట్టారు.



మంత్రి లోకేశ్, బ్రాహ్మణి దంపతులకు పట్టు వస్త్రాలు అందజేస్తున్న స్థల యజమాని కుమార్తె గీత





సిమెంట్ సిండికేట్

- బస్తాకు రూ.90 పెరుగుదల
- దూసుకుపోతున్న ఇనుము ధరలు
- టన్నుకు రూ.10 వేలు పెరిగిన ఐరన్
- నిర్మాణదారులు విలవిల.. రంగం కుదేలు
- ధరలపై కొరవడిన ప్రభుత్వ నియంత్రణ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సిమెంటు, ఇనుము ధరలు దూసుకుపోతున్నాయి. ధరల పెరుగుదలతో నిర్మాణదారులు కళ్లు తేలేస్తున్నారు. ఇసుక ధర తగ్గిందన్న సంతోషం ఇనుము.. సిమెంట్ ధరల పెరుగుదలతో ఆవిరైపోయింది. వేసవిలో సహజంగా నిర్మాణాలు ఊపందుకుంటాయి. ఇదే అదనుగా కంపెనీలు ధరలు పెంచి సొమ్ము చేసుకుంటున్నాయి. కంపె నీలు సిండికేట్‌తో సిమెంట్ ధరలను అమాంతం పెంచాయి. మూడు రోజుల వ్యవధిలోనే సిమెంట్ బస్తాకు రూ.80 నుంచి రూ.90 ధర పెరిగింది. ఇనుము నెల రోజుల వ్యవధిలో టన్నుకు రూ.10 వేలు పెరిగింది. ధరల పెరుగుదలపై ప్రభుత్వ నియంత్రణ పూర్తిగా కొరవడింది. దీంతో కంపె నీలు ధరలపై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా యని నిర్మాణదారులు ఆరోపిస్తున్నారు. ధరల పెరుగుదల నిర్మాణదా రులపై మోయలేని ఆర్థిక భారం పడుతోంది. సిమెంట్ ధరను పెంచడంతో పాటు సరఫరాను కంపెనీలు తగ్గించేశాయి. వ్యాపారులకు పూర్తిస్థాయిలో సిమెంట్ సరఫరా చేయడం లేదన్న విమర్శలున్నాయి. కృత్రిమ కొరతను సృష్టించేందుకు కంపెనీలు సిద్ధమయ్యాయన్న ఆరోపణలున్నాయి. సిమెంట్ కంపెనీలు సిండికేట్టై ఒక్కసారిగా బస్తాకు రూ.90 ధర పెంచాయని నిర్మా ణదారులు వాపోతున్నారు. మార్కెట్‌లో విక్రయిస్తున్న అన్ని రకాల సిమెంట్ ధరలను కంపెనీలు పెంచేశాయి. రోజురోజుకు సిమెంట్ ధరలు పెరుగుతున్నా నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని నిర్మాణ రంగ వర్గాలు విమర్శిస్తున్నాయి. సిమెంట్ కంపెనీలకు పాలకులు ఒత్తాసు పలకడం వల్లే ధరలను ఇష్టారాజ్యంగా పెంచేస్తున్నారని ఆరోపిస్తున్నారు. గత నెలలో ఇనుము టన్ను రూ.55,000 ఉంది. నెల రోజుల వ్యవధిలోనే మార్కెట్‌లో రూ.65 వేలకు చేరింది. రెండు రోజుల క్రితం ఒకేసారి టన్నుకు రూ.4 వేలు పెరిగిందని నిర్మాణదారులు చెప్పారు. ఇనుము, సిమెంట్ ధరలు ఒక్కసారిగా పెరగడంతో 20 శాతం భారం పడిందని నిర్మాణ దారులు వాపో తున్నారు. ధరల పెరుగుదలతో నిర్మాణాలను పలువురు నిలిపివే స్తున్నారు. దీంతో కార్మికులు ఉపాధిని కోల్పోతున్నా రు. ధరలను నియంత్రించి నిర్మాణ రంగాన్ని ప్రభు త్వం కాపాడాలని నిర్మాణదారులు కోరుతున్నారు.

ఇసుక టన్ను రూ.500

అక్రమార్కుల మధ్య పెరిగిన పోటీతో ఇసుక ధర తగ్గింది. టన్ను ఇసుక రూ.500కు ప్రస్తుతం సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ పరంగా ఇసుక సరఫరా నిలిచిపోయింది. దీంతో కృష్ణానదిలో ఇసుక అక్రమ మైనింగ్ పెద్దఎత్తున జరుగుతోంది. రోజు వేలాది టన్నుల ఇసుక మార్కెట్‌లోకి అక్రమార్కులు తరలిస్తున్నారు. నాణ్యమైన ఇసుక అందుబాటు ధరలోకి రావడంతో నిర్మాణాలు ఊపందుకున్నాయి. ఇదే సమయంలో సిమెంట్, ఇనుము ధరలు పెరగడంతో ఈ ప్రభావం నిర్మాణాలపై పడుతోంది.

అడ్మిషన్ల కోసం ఆరాటం

- ఇంటింటికీ ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు
- విద్యార్థుల సమాచారం సేకరణ
- పది ఫలితాలు రాగానే ఆన్‌లైన్ అడ్మిషన్లు

8

అమరావతి రాజమార్గాలకు టెండర్లు

రాజధానిలో ఈ - 13, ఈ - 15 రోడ్ల విస్తరణకు టెండర్లు

ఈ 13 రోడ్డుకు రూ. 70 కోట్ల వ్యయంతో టెండర్లు

సీడ్ యాక్సెస్ రోడ్డుకు రైతుల నుంచి సహాయ నిరాకరణతో .. ప్రత్యామ్నాయ రాజమార్గాల అభివృద్ధి

8

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకుల అరెస్టు

-1.5 కేజీలు స్వాధీనం

6

ఐఆర్‌ఆర్‌కు భూ సమీకరణ

- 2,196 ఎకరాల సమీకరణకు సీఆర్‌డీఏ సన్నాహాలు
- వీలుపడని చోట భూసేకరణ ప్రయత్నాలు
- సమీకరణ అయితేనే రైతులకు, సీఆర్‌డీకు ప్రయోజనం
- భూములను సిద్ధం చేసుకున్నాకే రింగురోడ్డు నిర్మాణం



నీటి తొట్టెలపై.. నిర్లక్ష్యం

- గుంటూరు, పల్నాడు జిల్లాలు వెనకడుగు
- గుంటూరులో 2, పల్నాడులో 12 మాత్రమే నిర్మాణం
- బాపట్లలో ఇప్పటికే 74 పూర్తి.. మరో 51కి అనుమతి
- రెండు వారాల వ్యవధిలో పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు
- ఉపాధి హామీ పథకాన్ని విరివిగా వినియోగించాలని సూచన

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వేసవి వేడి, వడగాడ్పుల దృష్ట్యా పశువులపై తీవ్ర ప్రభావం పడకుండా నీటి తొట్టెలను నిర్మించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఈ నీటి తొట్టెల నిర్మాణాలపై అధికారుల్లో నిర్లక్ష్యం కనిపిస్తోంది. మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకోవాలని ప్రభుత్వం సూచించినా అధికారుల్లో పెద్దగా స్పందన లేదని నీటి తొట్టెల నిర్మాణాలను చూస్తే అర్థమవుతోంది. గుంటూరు జిల్లాలో మొత్తం 30 తాగునీటి తొట్టెలు పశువులకు అవసరం అవుతాయని అంచనా వేశారు. అయితే వీటిలో ఇప్పటి వరకు కేవలం రెండు మాత్రమే నిర్మిం చారు. పల్నాడు జిల్లాలో వాతావరణం ఎక్కువ వేడిగా ఉంటుంది. అంతేకాకుండా అక్కడ పశువుల సంఖ్య కూ డా అధికం. ఈ దృష్ట్యా ఈ జిల్లాలో 248 నీటి తొట్టెలను వేర్వేరు గ్రామాల్లో నిర్మించాలని ఆదేశించగా వాటిల్లో కేవలం 12 మాత్రమే ఇప్పటివరకు ఆ జిల్లా అధికారులు నిర్మాణం పూర్తి చేయించారు. దీంతో 236 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. బాపట్ల జిల్లాలో అధికారులు కొంత శ్రద్ధ పెట్టడంతో అక్కడ ఇప్పటికే 74 తొట్టెల నిర్మాణం పూర్తి చేశారు. మరో 51 తొట్టెల నిర్మాణాలకు అధికారులు అనుమతులు మంజూరు చేశారు. వీటిని కూడా ఉపాధి హామీ పథకం ద్వారా తక్షణం పూర్తి చేయాలని ఆదేశించారు. నీటి తొట్టెలను నింపే బాధ్యతను ఆర్‌డబ్ల్యూఎస్‌కి కేటాయించారు. ఎండ వేడి నుంచి పశువులు, గొర్రెలు, మేకలను సంరక్షించకోవడానికి శుభ్రమైన తాగునీరు అందుబాటులో ఉంచేందుకు ఈ తొట్టెల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. ప్రతీ పశువుకు రోజుకు సుమారు 30 నుంచి 40 లీటర్ల తాగునీరు అవసరం అవుతుంది. ఆవులకు 30 లీటర్లు, గేదెలకు 40 లీటర్లు, గొర్రెలు, మేకలకు 5 లీటర్లు నీరు అవసరం. ఇందుకోసం 5,200 లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి తొట్టెలను గ్రామాల్లో నిర్మించాలని ప్రభుత్వం సూచించింది.



పశువుల నీటి తొట్టె

ఆస్తులతో పాటు ఉపాధి..

రబీ సీజన్‌లో పంటల సాగు దాదాపుగా పూర్తి అయింది. వరి, ఇతర పంటల కోతలు ముగిశాయి. ఈ నేపథ్యంలో కూలీలు పనులు లేక ఇబ్బంది పడుతుంటారు. కొందరైతే ఇతర ప్రాంతాలకు వలస కూడా వెళుతుంటారు. ఈ నేపథ్యంలో నీటి తొట్టెల నిర్మాణ పనులను ఉపాధి హామీ కింద చేపట్టాలని ప్రభుత్వం సూచించింది. దీనివల్ల అటు స్థిరాస్తులు ఏర్పడటమే కాకుండా ఇటు వ్యవసాయ కూలీలకు ఉపాధి పనిదినాలు అందుబాటులోకి వస్తాయి. ఇటీవలే రోజుకు ఉపాధి కూలిని రూ.300లకు పైగా ప్రభుత్వం పెంచింది. 100 రోజులకు పైగా పనిదినాలు కూడా కల్పించే అవకాశాన్ని కల్పించింది. ఈ నేపథ్యంలో గ్రామాల్లో పశువుల కోసం నీటి తొట్టెల నిర్మాణంపై అధికారులు దృష్టి పెడితే అటు మూగజీవాలకు ఇటు వ్యవసాయ కూలీలకు మేలు జరుగుతుంది.

30కిపైగా పార్కులు, చెరువుల అభివృద్ధి

- రూ.1.06 కోట్లతో సుందరంగా ఎస్‌ఎల్‌ఎన్ పార్కు
- ప్రారంభోత్సవంలో మంత్రి నారా లోకేశ్

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో దాదాపు 30కి పైగా పార్కులు, చెరువులను దశల వారీగా అభివృద్ధి చేస్తామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. మంగళగిరి బైపాస్ రోడ్డు వెంబడి లక్ష్మీనరసింహస్వామి కాలనీలో నూతనంగా అభివృద్ధి చేసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి (ఎస్ఎఎల్ఎన్) పార్కును బుధవారం ఆయన ప్రారంభించారు. 35 సెంట్ల విస్తీర్ణంలో రూ.1.06 కోట్లతో ఈ పార్కును సుందరంగా తీర్చిదిద్దారు. అధికారులు, స్థానిక నేతలతో కలిసి పార్కులో లోకేశ్ కలియతిరిగి కొద్దిసేపు సేదతీరారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ టిడ్కో ప్రాంగణంలోని ప్రతిపాదిత స్థలంలో రూ.9 కోట్లతో పార్కును అభివృద్ధి చేసేందుకు నిర్ణయించామని చెప్పారు. ఇందుకు సంబంధించిన పనులను ఈ నెలలోనే ప్రారంభిస్తామన్నారు. అలాగే నులకపేట, చినకాకానిలో లేక్ పార్కులను అభివృద్ధి చేసి వాకర్స్‌కు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ శ్రీనివాసులు, ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా, ఏపీ పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, నేతలు గుత్తికొండ ధనుంజయరావు, మన్నెం రమేష్‌బాబు, తోట పార్థసారధి, ఆకురాతి నాగేంద్రం, కందుల నాగార్జున పాల్గొన్నారు.



పార్కులో చిన్నారిని ఊయలూపుతున్న మంత్రి లోకేశ్

క్లీనర్‌ను కాపాడిన గోల్డెన్ అవర్ ఇంజెక్షన్



వినుకొండ ఏరియా వైద్యశాల్లో లారీ క్లీనర్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గుండె పోటు వచ్చిన లారీ క్లీనర్‌ను సకాలంలో ఏఎన్ఎం, సీహెచ్‌వోలు స్పందించి ప్రాణాలు నిలిపిన ఉందంతం కంచర్ల ప్రాథమిక వైద్యశాలలో జరిగింది. కంచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎం నాగవాణి వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. కంచర్ల గ్రామంలోని ఓ రైస్ మిల్లుకు విజయవాడ నుంచి ధాన్యం లోడుతో ఓ లారీ వచ్చింది. లారీలోని క్లీనర్‌కు ఒళ్లు అంతా చెమటలు పట్టి అస్వస్థతకు గురవటంతో కంచర్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. క్లీనర్ పరిస్థితి గమనించి నాగవాణి, ప్రమీలలు గుండెపోటుగా గుర్తించి తమ కారులో క్లీనర్‌ను వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు చేర్చారు. ప్రమాదాన్ని గుర్తించిన వినుకొండ వైద్యాధికారి డాక్టర్ రజాక్ సిబ్బంది సాయంతో క్లీనర్‌కు ఈసీజీ, బీపీ, రక్త పరీక్షలు చేసి గుండెపోటు వచ్చినట్లు నిర్ధారించారు. ఇటీవల ప్రభుత్వ వైద్యశాలల్లో రూ.40 వేలు విలువ చేసే గుండెపోటు నివారణ ఇంజెక్షను తక్షణమే ఇచ్చి ప్రాణాలను కాపాడారు. అనంతరం విజయవాడలోని క్లీనర్ బంధువులకు సమాచారం అందించారు. మెరుగైన వైద్యంకోసం 108 అంబులెన్స్‌లో గుంటూరుకు తరలించారు. దీంతో కుటుంబ సభ్యులు, మిల్లు ఓనర్ శ్రీనివాసరావులు సత్వరమే స్పందించి క్లీనర్ ప్రాణాలను కాపాడిన ఏఎన్ఎం, సీహెచ్‌వో, వైద్య బృందానికి అభినందనలు తెలిపారు. వినుకొండ వైద్యశాల పరిధిలో ఇప్పటివరకు 15మందిని ఈ గోల్డెన్ అవర్ ఇంజెక్షన్ అందించి ప్రాణాలను కాపాడినట్లు వైద్యాధికారి డాక్టర్ రజాక్ తెలిపారు.

ఐఆర్ఆర్‌కు భూ సమీకరణ

2,196 ఎకరాల సమీకరణకు సీఆర్‌డీఏ సన్నాహాలు

వీలుపడని చోట భూసేకరణ ప్రయత్నాలు

సమీకరణ అయితేనే రైతులకు, సీఆర్‌డీకు ప్రయోజనం

భూములను సిద్ధం చేసుకున్నాకే రింగురోడ్డు నిర్మాణం

ఇన్నర్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి భూ సమీకరణ విధానాన్ని అవలంబించాలని సీఆర్‌డీఏ అధికారులు భావిస్తున్నారు. దీనిపై త్వరలో కీలక నిర్ణయం తీసుకుని ముందుకెళ్లాలని యోచిస్తున్నారు. రాజధాని ప్రాంత పరిధిలోని అన్ని జిల్లాలకూ భూ సమీకరణ విధానాన్నే అమలు చేయాలని భావిస్తున్నారు. ఈ విధానమైతే బహుళ ప్రయోజనకరంగా ఉంటుందన్న ఉద్దేశంతో సీఆర్‌డీఏ ఈ ఆలోచన చేసింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)



ఇన్నర్ రింగ్‌రోడ్డు కోసం ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో 2,196 ఎకరాలు కావాల్సి ఉంటుంది. ఈ భూములను భూ సమీకరణ విధానంలో తీసుకుంటేనే సీఆర్‌డీఏకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఎందుకంటే 75 మీటర్ల వెడల్పున నిర్మించే ఇన్నర్ రింగ్‌రోడ్డుకు భూ సేకరణ విధానంలో అయితే సగటున రూ.3,000 కోట్ల మేర ఖర్చు చేయాల్సి ఉంటుంది. అదే భూ సమీకరణ విధానంలో అయితే అంత భారం ఉండదు. సమీకరణ విధానంలో అయితే రైతులకు ప్రతిగా రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్లను కల్పించాల్సి ఉంటుంది. ఇది రైతులకు ఎంతో ప్రయోజనకరం. ఎందుకంటే రూ.61 వేల కోట్లతో రాజధాని పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మూడేళ్లలో అమరావతి ఒక రూపును సంతరించుకోనుంది.

రాజధానిలో వచ్చే బూమ్ కారణంగా రైతులకు భూ సమీకరణ కింద ఇచ్చే ప్యాకేజీకి భారీగా విలువ పెరుగుతుంది. ప్రస్తుత మార్కెట్ ధరలను చూసినా కూడా రైతులు ఇచ్చే భూముల ధరలకు సమానంగా ప్యాకేజీ వచ్చే పరిస్థితి ఉంటుంది. ఈ దిశగా రైతులను చైతన్యపరచటానికి త్వరలో గ్రామసభలు నిర్వహించటానికి సన్నాహాలు చేస్తున్నారు.

భూములను సిద్ధం చేసుకున్నాకే ఐఆర్ఆర్

ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో ఇన్నర్ రింగ్‌రోడ్డు (ఐఆర్ఆర్)కు అవసరమైన 2,196 ఎకరాలను సిద్ధం చేసుకున్నాకే నిర్మాణ పనులు మొదలు పెట్టాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. భూములను సిద్ధం చేసుకోవటానికి ఏడాది సమయాన్ని నిర్దేశించుకుంది. ఆ తర్వాతే రోడ్డు నిర్మాణ పనుల దిశగా అడుగులు వేయాలని భావిస్తోంది. భూ సమీకరణకు ఎవరైనా అంగీకరించకపోతే భూ సేకరణ విధానంలో అయినా వెళ్లాల్సి ఉంటుంది.

పాత నోటిఫికేషన్ ప్రకారమే..

పాత నోటిఫికేషన్ ప్రకారమే ఐఆర్ఆర్‌ను కొనసాగించాలని సీఆర్‌డీఏ అధికారులు భావిస్తున్నారు. అలైన్‌మెంట్‌లో ఎలాంటి మార్పులు చేపట్టకూడదని నిర్ణయించినట్టు తెలిసింది. పాత అలైన్‌మెంట్ ప్రకారం 96.16 కిలోమీటర్ల పొడవున, 75 మీటర్ల వెడల్పున ఐఆర్ఆర్ ఉంటుంది. ఐఆర్ఆర్‌కు క్యాపిటల్ సిటీలో నిర్మిస్తున్న 27 రోడ్లు కూడా పాత అలైన్‌మెంట్ ప్రకారమే అనుసంధానమవుతాయి. సీఆర్‌డీఏ పరిధిలోని 11 జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్ల పరిధిలో ఐఆర్ఆర్ వస్తుంది. మొత్తం 42 గ్రామాల మీదుగా సాగుతుంది. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు సంబంధించి చోడవరం, దాములూరు, దోనె ఆత్కూరు, గంగూరు, ఇబ్రహీంపట్నం, జూపూడి, కవులూరు, కేతనకొండ, కొండపల్లి, కొండపల్లి రిజర్వు ఫారెస్ట్, కొటికలపూడి, కొత్తూరు, నవీపోతవరం, త్రిలోచనాపురం, జమీ మాచవరం, వెలగలేరు, రామచంద్రాపురం, వెదురుపావులూరు, సావారిగూడెం, నున్న, పాతపాడు, నిడమానూరు, పెనమలూరు, పోరంకి తదితర గ్రామాల మీదుగా అలైన్‌మెంట్ సాగుతుంది.

ఐఆర్ఆర్‌కు అనుసంధానమయ్యే అమరావతి రోడ్లు

ఇన్నర్ రింగ్‌రోడ్డుకు రాజధానిలోని మొత్తం 27 రోడ్లు అనుసంధానమవుతాయి. ఈ-1, 2, 3, 4, 5, 8, 9, 10, 11, 12, 13, 14, 15, 16, ఎన్-4, 7, 8, 9, 10, 11, 12, 13 రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వే వంటివి అనుసంధానమవుతాయి. ఇవన్నీ కూడా సింహభాగం 50 మీటర్లు, మిగిలినవి 60 మీటర్ల మేర ఉన్నాయి. మొత్తం 1,362.30 ఎకరాల మేర భూములు ఐఆర్ఆర్‌కు అనుసంధానమవుతాయి.

కన్నతల్లిని కడతేర్చిన కొడుకు

పోలీసుల అదుపులో నిందితుడు



బసవపూర్ణమ్మ

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని కన్న తల్లినే కొడుకు కడతేర్చిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం.. భట్టిప్రోలుకు చెందిన అంగలకుదురు బసవపూర్ణమ్మ (74)కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు దుర్గారావు నిజాంప ట్నం మండలం అడవులదీవిలో తాపీ పని చేసుకుంటూ జీవ నం సాగిస్తున్నాడు. ఆరు నెలల క్రితం భార్యతో గొడవపడి అక్కడి నుంచి భట్టిప్రోలు వచ్చి తల్లి వద్దే ఉంటున్నాడు. మద్యం కోసం డబ్బులు ఇవ్వాలని తల్లితో తరచూ గొడవ పడుతుంటాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని తల్లిని కోరడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగి ఇంట్లో ఉన్న కత్తిపీటతో చెవి, తల వెనుక భాగంలో నరకడంతో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెం దింది. తల్లి, కొడుకు గొడవ పడుతున్న విషయాన్ని చుట్టుపక్కల వారు గమనించినప్పటికీ రోజు పడే గొడవలే అనుకొని పెద్దగా పట్టించుకోలేదు. కొద్దిసేపటి తరువాత అను మానం వచ్చి చూడగా వృద్ధురాలు మంచంపై విగతజీవిగా పడి ఉండటం గుర్తించిన వారు స్థానికంగా ఉంటున్న మరో కుమారుడు వెంకటేశ్వరరావుకు సమాచారం ఇచ్చారు. దీంతో ఇంటికి వచ్చి తల్లిని చూడగా మృతి చెంది ఉండటం గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. బుధవారం ఉదయం రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు, వేమూరు సీఐ పీవీ ఆంజనేయులు ఘటనా స్థలాన్ని సందర్శించి హత్య జరిగిన తీరును పరిశీలించి క్లూస్ టీమ్‌తో వేలిముద్రలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం వైద్యశాలకు తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

అహంకార పూరితంగా వ్యవహరిస్తున్న జగన్ : ప్రత్తిపాటి

చిలకలూరిపేట ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి మండలం పాపిరెడ్డిపల్లెలో జగన్ చేసిన వీరంగం యాక్షన్ సినిమా క్లైమాక్స్‌ను తలదన్నినట్లుగా ఉందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పేరుకే పరామర్శ తప్ప జగన్ ప్రదర్శించినవన్నీ ఫ్యాక్షనిస్ట్ పోకడలేనన్నారు. పోలీస్ వ్యవస్థపై జగన్ చేసిన వ్యాఖ్యలు ఆయనలోని ఆధిపత్య ధోరణికి, అహంకారానికి నిదర్శనాలన్నారు. పోలీసుల బట్టలు ఊడదీయిస్తానన్న జగన్ వ్యాఖ్యలు ఏపీ పోలీస్ వ్యవస్థకే మాయని మచ్చ అని, తన తప్పు తెలుసుకొని జగన్ బేషరతు క్షమాపణ చెప్పేవరకు పోలీస్ వ్యవస్థ పోరాడాలని సూచించారు. పోలీస్ అధికారుల సంఘం న్యాయస్థానాల్ని ఆశ్రయించి జగన్‌కు శిక్షపడేలా చూడాలన్నారు.

నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరుటౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అర్బన్ పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. అర్బన్ పోలీసుల కథనం ప్రకారం ఇటికంపాడు రోడ్డులో అక్రమంగా రేషన్ బియ్యం కలిగి ఉన్న మురళి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 4 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మిర్చి రైతులకు వ్యాపారి టోకరా..

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కరాజు గార్లపాడు, అబ్బూరు, ఫిరంగిపురం మండలం 113 తాళ్ళూరు, యర్రగుంట్లపాడు గ్రామాలకు చెందిన రైతుల నుంచి లక్కరాజు గార్లపాడు గ్రామానికి చెందిన రావిపూడి తిరుమలరావు గతనెల 16న మిర్చి కొనుగోలు చేశాడు. గత కొన్నేళ్లుగా తిరుమలరావు రైతుల నుంచి నమ్మకంగా మిర్చిని కొనుగోలు చేస్తూ నగదు చెల్లిస్తున్నాడు. ఈ క్రమంలో పలువురు రైతుల నుంచి 381.5 క్వింటాళ్ళ మిర్చిని కొనుగోలు చేశాడు. అయితే కొందరు రైతులకు 34 లక్షల 85వేల 500రూపాయలను చెల్లించాల్సి ఉంది. రోజులు గడుస్తున్నా తిరుమలరావు డబ్బును చెల్లించక పోవడం, అదేమని ప్రశ్నిస్తే ఊరు వదిలిపోతానా అని దురుసుగా సమాధానం చెప్పేవాడని రైతులు తెలిపారు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుందని రైతులు తెలిపారు. రైతు మక్కెన సురేష్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మురకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఎంవీ సుబ్బారావు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్టు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం సంపాదించాలన్న అత్యాశతో నిషేధిత గంజాయిని విక్రయాలకు పాల్పడుతూ పోలీసులకు పట్టుబడిన ఉదంతం తెనాలిలో చోటుచేసుకుంది. బుధవారం స్థానిక త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ జనార్ధనరావు, సీఐ రమేష్‌బాబు కేసు వివరాలను వివరించారు. డీఎస్పీ మాట్లాడుతూ గుంటూరుకు చెందిన నందిపాటి రాజశేఖరరెడ్డి, మేడికొండూరుకు చెందిన తమనంపల్లి అరుణ్‌కుమార్, తెనాలి చినరావూరుకు చెందిన దాసరి ప్రకాష్‌బాబులు ముగురు కలసి ముఠాగా ఏర్పడ్డారు. రాజశేఖరరెడ్డి హైదారాబాదు నాంపల్లి రైల్వేస్టేషన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి దగ్గర 1.5 కేజీల గంజాయిని రూ.45 వేలుకు కొనుగోలు చేసి తెనాలి ప్రాంతానికి తెచ్చి చిన్నచిన్న ప్యాకెట్లుగా కళాశాలలు, ఇతర ప్రాంతాలలో యువకులకు విక్రయిస్తున్నారు. ఇదే క్రమంలో నిషేధిత గంజాయి అమ్ముతున్నట్లు త్రీటౌన్ పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా నిషేధిత గంజాయి ప్యాకెట్లతో పట్టుబడ్డారు. వారి వద్ద గంజాయిని స్వాధీనం చేసుకొని నిందుతులపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ చెప్పారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. నిషేధిత గంజాయి ఇతర మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నట్లుగాని, అమ్మకాలు చేస్తున్నట్లుగాని ప్రజల వద్ద సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ వెల్లడించారు. గంజాయి విక్రేతలను చాకచక్యంగా పట్టుకున్న సీఐ ఎస్ రమేష్‌బాబు, ఎస్సై ప్రకాషరావు, పోలీసు సిబ్బందిని డీఎస్పీ జనార్ధనరావు అభినందించారు. కార్యక్రమంలో సీఐ ఎస్ రమేష్‌బాబు, ఎస్సై ప్రకాషరావు, పీసీఎస్ పి మురళి, కె బాబురావు, ఎస్ జైకర్, ఎన్ శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుల వివరాలను తెలుపుతున్న డీఎస్పీ జనార్ధనరావు, సీఐ రమేష్‌బాబు, ఎస్సై ప్రకాష్‌రావు తదితరులు

సమయపాలన కోసం పదేపదే తప్పులు

గుంటూరు రైల్వే ఆపరేటింగ్ విభాగంపై విమర్శలు ● తరచూ సామాజిక మాధ్యమాల్లో పోస్టింగ్‌లు ● కొత్త డీఆర్ఎం అయినా పట్టించుకునేనా!

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైళ్ల సమయపాలన కోసం గుంటూరు రైల్వే డివిజన్ ఆపరేటింగ్ విభాగం అడ్డదారులు తొక్కుతున్నది. రైలు గుంటూరు రైల్వేస్టేషన్‌లో హోం సిగ్నల్ పాస్ అయిన తర్వాత సమయాన్ని ఆర్‌టీఎస్ ద్వారా ఆటోమేటిక్‌గా నమోదు చేయకుండా మాన్యువల్‌గా చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో రైళ్లు రెడ్డిగూడెం వద్ద ఉంటే బండారుపల్లి దాటి నల్లపాడు వచ్చేస్తున్నట్లు ఎంట్రీ కొడుతున్నారు. ఇక్కడ టెర్మినేట్ అయ్యే రైళ్లకు 15 నిమిషాల బఫర్ సమయం ఉండటంతో దాని ప్రకారం అంచనా వేస్తూ ఒకవేళ ఆలోపు రైలు వచ్చే పరిస్థితి లేకుంటే గూడ్స్ రైళ్లు ఆ సందర్భంలో పాస్ అయినా రైలు కింద నమోదు చేస్తున్నారు. గత కొన్ని నెలలుగా ఇదే తంతు కొనసాగుతున్నది.

ఏదైనా రైలు ఆలస్యమౌతుంటే ఆపరేటింగ్ విభాగంలో డిప్యూటీ అధికారి జోక్యం చేసుకొని ఆ ట్రైన్‌కు ప్రిసిడెన్స్ ఇచ్చి తీసుకొచ్చేలా చూడాలి. అలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇక వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కోసం 20 నిమిషాల నుంచి అరగంట పాటు నాన్‌స్టాపేజ్ రైల్వేస్టేషన్లలోని లూప్‌లైన్‌లో సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లను నిలుపుదల చేసేస్తున్నారు.

ఎన్‌టీఈఎస్(నేషనల్ ట్రైన్ ఎంక్వయిరీ సిస్టమ్)పై రైలు ప్రయాణీకులు నమ్మకం కోల్పోయేలా కొంతమంది ఆపరేటింగ్ విభాగం సిబ్బంది చేస్తున్నారు. బుధవారం ట్రైన్ నంబరు. 12748 వికారబాద్ - గుంటూరు పల్నాడు ఎక్స్‌ప్రెస్‌ని వందేభారత్ రైలు కోసం రెడ్డిగూడెం రైల్వేస్టేషన్‌లో నిలుపుదల చేశారు. దాదాపుగా ఈ రైలుని 25 నిమిషాల పాటు అక్కడ క్రాసింగ్ కోసం ఆపారు. అయితే ఆపరేటింగ్ విభాగం సిబ్బంది మాత్రం రైలు రాత్రి 8.09కి బండారుపల్లి దాటిందని, 8.19కి నల్లపాడు దాటిందని తప్పుడు సమాచారాన్ని ఎన్‌టీఈఎస్‌లో అప్‌డేట్ చేశారు. అది చూసి ప్రయాణీకులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. గతంలో నంబరు. 17254 ఔరంగబాద్ - గుంటూరు ఎక్స్‌ప్రెస్‌ని నల్లపాడులో గంటకు పైగా ఆపి గూడ్స్ రైళ్లకు ప్రిసిడెన్స్ ఇచ్చినట్లు ఒక ప్రయాణీకుడు ఫిర్యాదు చేశారు.

ఈ తరహా సంఘటనలు గుంటూరు రైల్వే డివిజన్‌లో నిత్యకృత్యంగా మారిపోయాయి. ఈ నేపథ్యంలో ఆపరేటింగ్/స్టేషన్ సిబ్బంది మాన్యువల్‌గా రైళ్ల ఆగమన సమయాన్ని నమోదు చేయకుండా ఆర్‌టీఎస్ పంపే సమాచారాన్ని యథాతథంగా ఎన్‌టీఈఎస్‌లో అప్‌లోడింగ్ చేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు. దీని వలన తమకు రైలు ప్రయాణిస్తున్న కచ్చితమైన సమయం తెలుసుకొనే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అలానే రైలు ఏదైనా స్టేషన్‌కు వచ్చి ఆగి బయలుదేరినప్పుడు ఫస్టు సిగ్నల్ పాసింగ్ సమయం నమోదు అయ్యేలా చూడాలని సూచిస్తున్నారు. లేకుంటే ఇలాంటి సమాచారాలతో ఎన్‌టీఈఎస్ విశ్వసనీయత దెబ్బతింటుంది. నూతన డీఆర్ఎం సుధేష్ణ సేన్ ఆపరేటింగ్ విభాగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రయాణీకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రేపల్లె ఎక్స్‌ప్రెస్ చర్లపల్లి వరకే

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నిత్యం రేపల్లె - సికింద్రాబాద్ - రేపల్లె మధ్యన రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్‌ని కొన్ని నెలల పాటు చర్లపల్లి వరకే నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి నంబరు. 17645 చర్లపల్లి - రేపల్లె ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 1 గంటకు బయలుదేరి రాత్రి 9.05కి రేపల్లె చేరుకొంటుంది. నంబరు. 17646 రేపల్లె - చర్లపల్లి ఎక్స్‌ప్రెస్ ఉదయం 7.10కి బయలుదేరి మధ్యాహ్నం 3.35కి చర్లపల్లి చేరుతుంది. మార్గమధ్యలో ఉన్న రైల్వేస్టేషన్లలో ఎలాంటి సయమపట్టికలో ఎలాంటి మార్పులు చేయలేదని సీపీఆర్‌వో తెలిపారు.

హైదరాబాద్ డివిజన్‌లో ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా ఈ నెల 11, 12, 13 తేదీల్లో గుంటూరు - ఔరంగబాద్ ఎక్స్‌ప్రెస్‌ని 90 నిమిషాల పాటు రీషెడ్యూల్ చేస్తున్నట్లు డీఆర్ఎం సుధేష్ణ సేన్ తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణీకులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

బొమ్మాయిపల్లి వరకు ఇన్‌స్పెక్షన్ నిర్వహించిన డీఆర్ఎం

గుంటూరు రైల్వే నూతన డీఆర్ఎం సుధేష్ణ సేన్ తన క్షేత్ర పర్యటనలను ప్రారంభించారు. బుధవారం ఉదయం ఆమె గుంటూరు నుంచి ప్రత్యేక రైలులో నడికుడి మార్గంలో ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. బొమ్మాయిపల్లి వరకు వెళ్లారు. మార్గమధ్యలోని స్టేషన్లలో దిగి అక్కడి పరిస్థితులను తెలుసుకొన్నారు. అలానే కృష్ణానదిపై వంతెన, గుంటూరు, నల్గొండ జిల్లాల్లో ఉన్న సరుకు రవాణ టెర్మినల్స్‌ని పరిశీలించారు.

కారుమూరిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోండి

గుంటూరులో పోలీసులకు టీడీపీ నేతల ఫిర్యాదు

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు ఇవతల వాళ్లను ఇంటిలో నుంచి లాగి కొడతామని.... గుంటూరు అవతల వాళ్లను నరికేస్తామని అత్యంత దారుణంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం గుంటూరు వెస్ట్ డీఎస్పీ అరవింద్‌కు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో క్రిస్టియన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల మ్యాని, కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, యల్లావుల అశోక్ యాదవ్, మైనార్టీ నాయకుడు పఠాన్ అస్మతుల్లా, అడకా శ్రీనివాసరావు, రఘు వెస్ట్ డీఎస్పీ అరవింద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కనపర్తి మాట్లాడుతూ మంగళవారం ఏలూరులో జరిగిన వైసీఈపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సమాజంలో ప్రజల మధ్య, రాజకీయ పక్షాల మధ్య వైషమ్యాలు పెంచే విధంగా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలనే కుట్రతో నరికేస్తాం, ఇళ్లలో నుంచి లాగి కొడతాం అంటూ అత్యంత దారుణమైన వ్యాఖ్యలు చేశారన్నారు. ఆయన పై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని పశ్చిమ డీఎస్పీ అరవింద్ కి ఫిర్యాదు చేశారు. కారుమూరి ఉడతూపులకు భయపడే ప్రసక్తే లేదని, జగన్ రెడ్డి లాంటి సైకోలానే ఎదిరించి ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా చేసిన చరిత్ర తెలుగుదేశం పార్టీదని అన్నారు. బాధ్యత కలిగిన మాజీ ముఖ్యమంత్రి, మాజీ మంత్రులే ఇంత దారుణంగా విచక్షణ మరచి వ్యాఖ్యలు చేస్తుంటే ఆ పార్టీ నాయకులు మరింత రెచ్చిపోయే ప్రమాదం ఉందన్నారు.



గుంటూరులో వెస్ట్ డీఎస్పీ అరవింద్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు కనపర్తి, మ్యానీ తదితరులు

ఎంఈవో వసూళ్ల దందాపై విచారణ

ఆంధ్రజ్యోతి వార్తకు డీఈవో రేణుక స్పందన

గుంటూరు(విద్య), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అప్పగించిన విధులు విస్మరించి ప్రైవేటు పాఠశాలల్లో, ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ విషయంలో వసూళ్ల దందాకు పాల్పడుతున్న ఇద్దరు ఎంఈవోలపై డీఈవో రేణుక విచారణకు ఆదేశించారు. గుంటూరు డిప్యూటీ డీఈవో ఏసురత్నం ఆధ్వర్యంలో విచారణ చేపట నున్నారు. ప్రైవేటు పాఠశాలల యాజ మాన్యాలను, ఎయిడెడ్, ప్రభుత్వ ఉపా ధ్యాయులను పూర్తిస్థాయిగా విచారించి ఎవరెవరు ఎంతెంత డబ్బులు ఇచ్చారనే దానిపై సమగ్ర నివేదిక తయారుచేసి డీఈవోకు సమర్పించనున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

1,35,382 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,31,198 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,35,382 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 62,733 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	10000	12400
334	9500	13000	బ్యాడిగి 355	10000	13200
నంబరు. 5	10000	13200	సింజెంటా		
273	10000	12800	బ్యాడిగి 5531	--	--
341	10500	13800	దేవనూరు డీలక్స్	10000	12500
4884	10000	11600	ఆర్మూరు	9800	11000
సూపర్ 10	--	--	తాలుకాయలు	4500	6500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ					
తేజ	10200	13400			

శాంతిభద్రతల సమస్య సృష్టించాలనుకుంటున్న జగన్

గుంటూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుంటే ఓర్వలేక శాంతిభద్రతల సమస్యలను సృష్టించాలనుకోవడం దుర్మార్గమని టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య విమర్శించారు. ఆ మేరకు ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను నాశనం చేసిన జగన్ ఓర్వలేక ఇలా చేస్తున్నాడని విమర్శించారు. ఇంతవరకు రాష్ట్రంలో జగన్ పరామర్శించిన కుటుంబాలకు ఎవరికైనా పైసా ఆర్థిక సహాయం చేయడం చూశారా అని ప్రశ్నించారు.

పోలీసులపై జగన్ వ్యాఖ్యలు బాధాకరం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌కుమార్

గుంటూరు సిటీ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేయటం బాధాకరమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పోలీసుల బట్టలు ఊడదీస్తానని, యూనిఫాం తీయించి ఉద్యోగం లేకుండా చేస్తానని, రాబోయేది తమ ప్రభుత్వం అని జగన్ పేర్కొనటం హాస్యాస్పదంగా ఉందన్నారు. జగన్మోహన్ రెడ్డికి సెక్యూరిటీ ఇస్తున్నది పోలీసులు అన్న విషయాన్ని మర్చిపోయారా అని ప్రశ్నించారు. నోరు అదుపులో పెట్టుకోలేని వైసీపీ నాయకులు జైలుపాలై అష్టకష్టాలు పడుతున్న విషయాన్ని గుర్తుచేశారు. రాజకీయ నాయకులను వ్యక్తిగతంగా విమర్శించిన కారణంగానే వైసీపీ ఓడిపోయిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. రాజకీయాల్లో విమర్శలు వ్యక్తిగతంగా ఉండకూడదని చెప్పారు. ఇప్పటికీ జగన్‌లో మార్పు రాకపోవడం విస్మయాన్ని కలిగిస్తుందన్నారు. ఇదే కొనసాగితే వైసీపీ కనుమరుగవుతుందని జోస్యం చెప్పారు.

ముగిసిన పదో తరగతి మూల్యాంకనం

గుంటూరు విద్య, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం బుధవారం ప్రశాంతంగా ముగిసింది. కార్యక్రమాన్ని నిబంధనల ప్రకారం పూర్తిచేశామని డీఈఓ రేణుక తెలిపారు. ఎంఈఓలు, డీవైఈఓ, హెచ్‌ఎంలు, సబ్జెక్టు టీచర్ల సమిష్టి కృషితో కార్యక్రమాన్ని ముగించామని తెలిపారు. ఐటీ సెల్ బార్ కోడింగ్ సిబ్బంది ఇందులో పాల్గొన్నట్లు తెలిపారు. క్యాంప్ ఆఫీసర్లు, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు సహకారంతో మూల్యాంకనం విజయవంతంగా ముగిసినట్లు వివరించారు.

ఉన్నత పాఠశాలల్లోని ఎస్‌జీటీ పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో ఉన్న దాదాపు 120 సెకండరీ గ్రేడ్ పోస్టులను స్కూల్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేయాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కొండూరు శ్రీనివాసరాజు, బొనిగల హైమారావులు విజ్ఞప్తి చేశారు ఈ మేరకు బుధవారం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ కే విజయరామరాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2009లోనే రాష్ట్రంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ పోస్టులను స్కూల్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేశారన్నారు. రాష్ట్రంలోని మున్సిపల్, కార్పొరేషన్‌లో ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ అయిన పాఠశాలలకు గ్రేడ్ 2 ప్రధాన ఉపాధ్యాయులు, అన్ని సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి జూలపల్లి శ్రీనివాసరావు, విజయవాడ ప్రధాన కార్యదర్శి యాసం చంటిబాబు, ఎన్‌టీఏ నాయకులు పాల్గొన్నారు.

ఇస్రో యువికాకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

గుంటూరు(విద్య), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఇస్రో యువికా పోటీలకు ఎంపికైన విద్యార్థులను జేసీ భార్గవ్ తేజ బుధవారం అభినందించారు. ముట్లూరు జడ్పీహైస్కూలుకు చెందిన సంధు పవన్‌దుర్గ, కేకేఆర్ గౌతమ్ విద్యార్థి ఒక్కపట్ల సోమశేఖర్ పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో డీఈఓ రేణుక, హెచ్‌ఎం జోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు. మే 18 నుంచి 31వ తేదీ వరకు శ్రీహరికోటలోని ఇస్రోలో యువిక కార్యక్రమంలో నిర్వహించనున్నారు.

చంద్ర రాజేశ్వరరావు పోరాటాలు స్ఫూర్తిదాయకం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల హక్కులకై చంద్ర రాజేశ్వరరావు చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ కొనియాడారు. కొత్తపేటలో సీపీఐ కార్యాలయంలో రాజేశ్వరరావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. రాజేశ్వరరావు ఆశయాలను కొనసాగించడమే ఆయనకిచ్చే ఘన నివాళని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కోట మాల్యాద్రి, చల్లా చిన ఆంజనేయులు, జి.సురేషబాబు, చల్లా మరియదాసు, నూతలపాటి చిన్న, దూపాటి వెంకటరత్నం, ఇరిగినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కృపా మహాసభలు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు రోడ్, హౌసింగ్ బోర్డు కాలనీ ఎదుట గురువారం నుంచి ఆదివారం వరకు కృపా మహాసభలు జరుగుతాయని కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు మాథ్యూస్ తెలిపారు. బుధవారం మహాసభల ఏర్పాట్లును పరిశీలించి వివరాలను వెల్లడించారు.విశ్వాసులకు భోజనం, వసతి సదుపాయాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో హోసన్నా పాస్టర్లు డేవిడ్ రాజు, తిమోతి, క్రైస్తవ సంఘ నాయకుడు యర్రి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి కేఎల్‌పీలో వేసవి క్రీడా శిబిరం

గుంటూరు(విద్య), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్లో ఈనెల 24 నుంచి నెల రోజులపాటు వేసవి క్రీడా శిబిరం నిర్వహిస్తున్నట్లు పాఠశాల కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బుధవారం పోస్టర్స్ ఆవిష్కరించారు. శిబిరంలో క్రికెట్, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, స్కేటింగ్, కరాటే, కర్రసాము, చదరంగం, ఆర్ట్స్‌అండ్‌క్రాఫ్ట్స్ ఇన్స్ట్రుమెంట్ మ్యూజిక్, పాశ్చాత్య నృత్యం తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు వివరాలు కోసం 0863 2350392లో సంప్రదించాలని సూచించారు.



పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న కొండబోలు కృష్ణ ప్రసాద్ తదితరులు

ప్రణాళికాబద్ధంగా పనులు చేస్తే విజయం సొంతం

● కమిషనర్ పులి శ్రీనివాసులు



ప్రసంగిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కష్టపడేతత్వం, ప్రణాళికాబద్ధంగా పనులు చేస్తే విజయం సాధించవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం విజ్ఞాన మందిరంలో స్మార్ట్ టెక్స్, నగర పాలక సంస్థ ఆధ్వరంలో చేపట్టిన మెగా జాబ్‌మేళాకు సంబంధించి రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఏర్పాటుచేసిన ఓరియంటేషన్ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతున్నారు. ప్రైవేట్ సంస్థలలో ఉద్యోగాలు రావాలంటే కమ్యునికేషన్ స్కిల్స్ ఉండాలని, దానితోపాటు కష్టపడే తత్వం ఉండాలన్నారు. ఈ కార్యక్రమం వలన ఉద్యోగార్థులలో స్కిల్స్ వెలికితీయడమెలాగో స్మార్ట్‌టెక్స్ వివరిస్తారన్నారు. స్మార్ట్ టెక్స్ నగర పాలక సంస్థ అందిస్తున్న ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, సెక్రటరీ పి.శ్రీనివాసరావు, మేనేజర్ బాలాజీబాషా, స్మార్ట్‌టెక్స్‌ప్రతినిధులు పాల్గొన్నారు.

వీధికుక్కలకు వ్యాక్సినేషన్‌కు జంతు ప్రేమికులు సహకరించాలి

నగరంలో వీధికుక్కల కుటుంబ నియంత్రణ, యాంటీ ర్యాబీస్ వ్యాక్సినేషన్ అత్యావశ్యమని, అందుకు జంతు ప్రేమికులు కూడా సహకరించాలని నగర కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో జంతు ప్రేమికులు, పశుసంవర్ధక శాఖ, జీఎంసీ ప్రజారోగ్యశాఖ అధికారులతో ఏబీసీ నిర్వహణపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వీధి కుక్కల సమస్యలపై ప్రజల నుండి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. కేంద్రబృందం పరిశీలన అనంతరం వారి సూచనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, డాక్టర్ చక్రవర్తి, ఈశ్వరరెడ్డి, జీఎంసీ వీఏఎస్ డాక్టర్ వెంకటేశ్వర్లు, జంతు ప్రేమికులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో కఠినంగా ఉంటాం

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య పనుల నిర్వహణలో కఠినంగా ఉంటామని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. బుధవారం కమిషనర్ శారదా కాలనీ, దుర్గానగర్, బస్టాండ్, ఓల్డ్‌క్లబ్ రోడ్, గోరంట్ల, అమరావతి రోడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో ఎస్ఎస్ జి.ఐజాక్, టీపీఎస్‌లు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అనధికార మాంస వ్యర్థాల తరలింపుదారులపై చర్యలు తీసుకుంటామని, టెండర్ ద్వారా వ్యర్థాల తరలింపు కాంట్రాక్ట్ పొందిన ఏజన్సీనే సోమవారం నుండి వ్యర్థాలను సేకరిస్తుందని కమిషనర్ స్పష్టంచేశారు. బుధవారం నగరపాలక సంస్థలో చికెన్, మటన్ షాప్‌ల అసోసియేషన్ ప్రతినిధులు, నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో రోడ్ల వెంబడి అనధికార చికెన్, మటన్, చేపల విక్రయాలు నిషేధమన్నారు.

నోటిదురుసు తగ్గించుకోకుంటే తగిన శాస్తి



ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే మాధవి

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి హెచ్చరిక

గుంటూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు నోటి దురుసు తగ్గించుకోకపోతే తగిన రీతిలో బుద్ధి చెప్తామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి హెచ్చరించారు. టీఎన్‌టీయూసీ నేతలతో బుధవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సంబంధిత మంత్రితో చర్చించి పరిష్కరిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు కార్మికుల సమస్యలను గాలికి వదిలివేసి, నేడు జగన్‌సహా, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేల వరకు బరితెగించి మాట్లాడుతున్నారన్నారు. నిన్నటివరకు కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టాలని చూశారని, ఇప్పుడు పార్టీ నేతలను రెచ్చిగొట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తున్నారని ఆరోపించారు. వారి బహిరంగ వ్యాఖ్యల వెనుక కుట్రకోణం ఉన్నదని, పోలీసు ఉన్నతాధికారులు సుమోటోగా క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎమ్మెల్యే కోరారు. సమావేశంలో గుంటుపల్లి శేషగిరిరావు, మదమంచి శ్రీనివాసరావు, సానికొమ్ము శ్రీనివాస్‌రెడ్డి, పెనుమర్తి శ్రీనివాసరావు, పుల్లా సుందరం, సాధినేని శ్రీనివాస్ రావు, సాదు కేశవనాయుడు, గుంజి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే మాధవి ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజలు, పార్టీ నేతల నుంచి ఆమె వినతులు స్వీకరించారు. మునిసిపాలిటీలో అవుట్ సోర్స్ పారిశుధ్య కార్మికులను తమ ప్రాంతానికి దూరంగా విధులు వేయటం వలన ఇబ్బందులకు గురవుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. శాలివాహన చక్రవర్తి విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని ఆ సంఘ నేతలు కోరారు. కార్యక్రమంలో కొమ్మినేని కోటేశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దనే సమస్యల పరిష్కారం

● ఎమ్మెల్యే నసీర్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి కాళ్లరిగేలా తిరగాల్సిన పనిలేదని, పరిష్కారమే కదిలి వస్తుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని 50, 51 సచివాలయాల పరిధిలో బుధవారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. రేషన్‌కార్డులు లేవని, పింఛన్ రావడం లేదని, ఇళ్లస్థలాలు కావాలని, మురుగువంటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎక్కువమంది విన్నవించారు. గత ప్రభుత్వంలో అధికారుల నిర్లక్ష్యంతో ఇతర ఆస్తులకు తమ ఆధార్‌కార్డులు లింకై రావాల్సిన సంక్షేమపథకాలు ఆగిపోతున్నాయని వాపోయారు. వీటిని పరిశీలించిన ఎమ్మెల్యే ప్రాధాన్యత ప్రకారం పరిష్కరించనున్నట్లు తెలిపారు.

● గుంటూరు తూర్పులో అభివృద్ధి మంత్రం

గుంటూరు తూర్పు నియోజకవర్గంలో గత ఐదేళ్ల కాలంలో అధ్వానంగా మారిన రోడ్లు, సీసీ డ్రెయిన్లను కేవలం 9 నెలల కాలంలోనే అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని లాలాపేట గంటలమ్మ చెట్టు వద్ద, సంగడిగుంట చెక్కల బజార్ మసీద్ సెంటర్ వద్ద, రెడ్లబజార్ నాలుగో లైన్‌లో రూ.1.20కోట్ల వ్యయంతో నూతన సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇన్‌చార్జ్ మేయర్ షేక్ సజీలా, మొహమ్మద్ హఫీజ్, కుమార్ అబ్దుల్ సలీం, దుర్గ, బద్రి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకమే మార్గం

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సూచించారు సోమవారం జేకేసీ కళాశాలలో ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా కొమర అంకారావు రాసిన మూలికా వైద్యం పుస్తకాల ఆవిష్కరణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, మొక్కలు విస్తృతంగా పెంచేలా అవగాహన కల్పించాలని సూచించారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ సకల జీవరాసులు చెట్లపైనే ఆధారపడి ఉన్నాయని వాటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు .కార్యక్రమంలో డీఎఫ్ఓ హిమ శైలజ, ఫారెస్ట్ రేంజర్ పోతురాజు, కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్ ప్రిన్సిపల్ గోపీచంద్, గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ అండ్ టెక్నాలజీ ప్రొటెక్షన్ సర్వీస్ వ్యవస్థాపకుడు చెలికాని సీతారామయ్య, ఆయుర్వేద వైద్యులు కొండా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా కొమర అంకారావును ఘనంగా సత్కరించారు

ప్రజా సమస్యలపై అలుపెరగక పోరాడిన లక్ష్మణరావు

గుంటూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు నిరంతరం పోరాడారని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి ప్రశంసించారు. అరండల్‌పేటలోని స్ఫూర్తి ఫౌండేషన్ కార్యాలయంలో పలు ప్రజా సంఘాలు, పలువురు మేధావులు, యువజన సంఘాల ఆధ్వర్యంలో బుధవారం మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావును సత్కరించారు. ఈ సందర్భంగా స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ నగరంలో జరిగిన అన్ని ప్రజోపయోగ పోరాటాల్లో లక్ష్మణరావు తన వంతు పాత్ర పోషించారన్నారు. లక్ష్మణరావు మాట్లాడుతూ భవిష్యత్తులో జరిగే ప్రజా ఉద్యమాలకు, స్ఫూర్తి ఫౌండేషన్ నిర్వహించే కార్యక్రమాలకు తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, జేవీవీ నాయకుడు లక్ష్మణరెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి మాల్యాద్రి, కొండా శివరామిరెడ్డి, బందా రవీంద్రనాథ్, వెంకటరావు, ధనుంజయరెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

నూతన భవన సముదాయానికి రూ 6లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని కమ్మజన సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి భవన సముదాయంలో ఒక గదికి అయ్యే ఖర్చు రూ.6లక్షలను బుడంపాడు గ్రామానికి చెందిన జాగర్లమూడి శ్రీరామ్ ప్రసాదు, సుమతి విరాళాన్ని ప్రకటించారు. బుధవారం స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లో కమ్మజనసేవ సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావుకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ జాగర్లమూడి సూర్యనారాయణ, స్వరాజ్యలక్ష్మీ జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, పాలక వర్గ సభ్యుడు పెద్ది సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా సయ్యద్ జబీవుల్లా



నియామక ఉత్తర్వులు అందుకుంటున్న జబీవుల్లా తదితరులు

గుంటూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడుగా పొన్నూరు రోడ్డులోని బారాయిమాంపంజాకు చెందిన సయ్యద్ జబీవుల్లా, నగర అధ్యక్షుడుగా సయ్యద్ అస్గర్ ఆలీలు నియమితులయ్యారు. ఈ మేరకు రాజీవ్‌గాంధీభవన్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్ వీరికి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఇంటింటికి కాంగ్రెస్ పార్టీని తీసుకెళ్ళాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పశ్చిమ ఇన్‌చార్జ్ రాచకొండ జాన్‌బాబు, చుక్కా చంద్రపాల్, యన్నం సుధీర్‌బాబు, షేక్ కరిముల్లా, బిళ్ళా సునీల్, సుభాని, రామకృష్ణ, మోషే తదితరులున్నారు. అనంతరం ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరిముల్లా ఆధ్వర్యంలో 55వ ఎన్‌ఎస్‌యూఐ వ్యవస్థాపక దినోత్సవం జరిగింది.

గంజాయి ఉన్న వ్యక్తి అరెస్టు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గంజాయి కలిగి ఉన్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ టూ టౌన్ సీఐ ఏం యశోద బుధవారం తెలిపారు. గుంటూరు నగరంలో గంజాయి అమ్ముతున్న వ్యక్తుల గురించి దాడులు జరపగా గుంటూరు నగర పరిధిలో చుట్టుగుంట సెంటర్ నుండి వీఐపీరోడ్ మార్టిన్ వద్ద గుంటూరు పట్టణం, నంబూరు సుభాని కాలనీ, పీకలవాగు కట్ట ప్రాంతానికి చెందిన షేక్ మాస్తాన్ వలి గంజాయి ప్యాకెట్లు కలిగివుండడంతో అతనిని అదుపులోకి తీసుకుని పరిశీలించగా అతని వద్ద 879 గ్రాముల గంజాయి ఉన్నట్లు ఆమె తెలిపారు. నిందితుడి అరెస్ట్ చేసి కోర్టుకు హాజరపరిచినట్లు ఆమె తెలిపారు.

పోలీసుల మనోభావాలు దెబ్బతీసేలా జగన్ వ్యాఖ్యలు

● రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ

గుంటూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మీడియా వేదికగా పోలీసులపై మాజీ సీఎం జగన్‌చేసిన వ్యాఖ్యలు పోలీసు సిబ్బంది మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎవరైనా అధికారులు తప్పు చేస్తే వారిపై చర్యలు తీసుకోవాలని ఉన్నత స్థాయి అధికారులను కోరే అవకాశం ఉంటుందని తెలియకపోవటం విచారకరమన్నారు. జగన్ వాడిన భాషను ఎవరూ హర్షించరని స్పష్టం చేశారు. జగన్ మాటలు పోలీసు వ్యవస్థను కించపరిచే లా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా జగన్‌పద్ధతి మార్చుకోవాలన్నారు.

అర్హత ఉన్న తెలుగు స్కూల్ అసిస్టెంట్స్‌ను పదోన్నతుల జాబితాలో చేర్చాలి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో జడ్పీ పాఠశాలల్లో పనిచేస్తున్న తెలుగు స్కూల్ అసిస్టెంట్స్‌ను పదోన్నతుల జాబితాలో చేర్చాలని ఏపీటీఎఫ్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం డీఈఓ రేణుకకు వినతిపత్రం అందజేశారు. స్కూల్ అసిస్టెంట్ తెలుగు సబ్జెక్ట్ సీనియారిటీ లిస్ట్‌లో అర్హతగల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు అందరినీ చేర్చాలని, డిగ్రీలో స్పెషల్ తెలుగు, బీఈడీలో తెలుగు మెథడాలజీ కలిగిన వారిని తెలుగు స్కూల్ అసిస్టెంట్ సీనియార్టీ జాబితాలో చేర్చాలని ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు సూచించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఫ్యాప్టో చైర్మన్, జిల్లా ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి కె.నరసింహారావు, ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

● బీజేపీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ వల్లూరు జయప్రకాష్ నారాయణ



మాట్లాడుతున్న వల్లూరి జయప్రకాష్ నారాయణ

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ వల్లూరు జయప్రకాశ్ నారాయణ అన్నారు. బుధవారం లాలుపురం బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలలో భాగంగా క్రియాశీల కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ అమరావతి, పోలవరం నిర్మాణాలకు నిధులు కేంద్రమే భరిస్తుందని, ఈ విషయాన్ని ప్రజలకు చేరువ చేయాల్సిన బాధ్యత కార్యకర్తలు, నాయకులపై ఉందన్నారు. రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. సమావేశంలో మాజీమంత్రి శనక్కాయల అరుణ, జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, కొత్తూరు సుబ్బారావు, ఈదర శ్రీనివాసరెడ్డి యడ్లపాటి స్వరూపరాణీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన గర్భిణికి క్లిష్టమైన శస్త్రచికిత్స

● అనంతరం అదే రోజు కాన్పు చేసిన వైద్యులు

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తాపడిన ఘటనలో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న గర్భిణికి గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో వైద్య బృందం క్లిష్టమైన శస్త్రచికిత్స చేశారు. అదేరోజు అత్యవసరంగా ప్రసవం జరిపారు. వివరాల్లోకి వెడితే... నీలపు శివశంకరరావు, శిరీష దంపతులు మార్చి 24న పెదపరిమి సమీపంలో ఆటో బోల్తాపడిన సంఘటనలో గాయపడ్డారు. నిండు చూలాలైన శిరీషకు తీవ్రగాయాలయ్యాయి. తలకు గాయంకావడంతోపాటు ఉదరంలో అంతర్గత రక్తస్రావం జరిగింది. వెంటనే బాధితులను గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి లేబర్‌వార్డుకు తరలించారు. వైద్యపరీక్షల్లో శిరిష లివర్‌కు గాయమై అధికంగా రక్తస్రావం జరుగుతున్నట్లు గుర్తించారు. అనంతరం డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ అండె కోటి వెంకటేశ్వరరావు, డాక్టర్ అరుణ, డాక్టర్ శిరీష, డాక్టర్ పోలయ్య, డాక్టర్ నాగభూషణం తదితర వైద్య విభాగాలకు చెందిన డాక్టర్లు నాలుగు గంటల పాటు శ్రమించి శస్త్రచికిత్స చేసి ఆమె ప్రాణాలు కాపాడారు. అదేరోజు ఆమెకు సిజేరియన్ జరపగా, ఆడ శిశువును ప్రసవించింది. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. బుధవారం శిరీషను ఆసుపత్రి నుంచి డిశ్చార్జీ చేశారు. తనను, తన బిడ్డను కాపాడిన వైద్యులకు శిరీష దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.



వైద్య బృందంతో శివశంకరావు, శిరీష దంపతులు

గుంటూరులో గ్యాంగ్ రేప్‌కు యత్నం

● తెల్లవారుజామున ఆర్టీసీ బస్టాండ్ పక్కన చెట్ల పొదల్లోకి యువతిని తీసుకువెళ్లిన నలుగురు యువకులు

● యువతి కేకలతో ఆటో డ్రైవర్లు అప్రమత్తం.. పోలీసులకు సమాచారం

● పరారీకి యత్నం... ఇరువురిని పట్టుకున్న పోలీసులు

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసీ బస్టాండ్‌కు కూతవేటు దూరంలో నలుగురు యువకులు గ్యాంగ్ రేప్‌కు యత్నించారు. బుధవారం వేకువ జామున జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఓ లాడ్జి వద్ద ఉన్న యువతిని ఓ యువకుడు బస్టాండ్ పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి తీసుకువెళ్లాడు. ఆ తర్వాత మరో ముగ్గురు అతడి వెంటే వెళ్లారు. అదే సమయంలో ఓ యువకుడు ఆమెను కొట్టి డబ్బులు గుంజుకున్నాడు. నలుగురు ఆమెపై గ్యాంగ్ రేప్‌కు యత్నించారు. దీంతో భయపడిన ఆ యువతి పెద్దగా కేకలు వేసింది. ఆ కేకలు విన్న సమీపంలోని ఆటో స్టాండ్ డ్రైవర్లు అప్రమత్తమై పోలీసులకు సమాచారం ఇచ్చి సంఘటన స్థలం వైపు వెళ్లారు. ఆటో డ్రైవర్లు రావడం చూసిన యువకులు పరారయ్యారు. ఇంతలో నైట్ బీట్ పోలీస్ సిబ్బంది పరారైన యువకుల వెంట పడడంతో ఓ యువకుడు పట్టుబడ్డాడు. ఏమీ ఎరగనట్లు నడుచుకుంటూ వెళ్తున్న మరో యువకుడ్ని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన ఇద్దరూ బస్టాండ్ సమీపంలోని రామిరెడ్డితోట ప్రాంతానికి చెందినవారిగా పోలీసులు గుర్తించారు. మిగిలిన ఇద్దరి కోసం గాలిస్తున్నారు. కాగా బాధిత యువతి నెల్లూరుకు చెందిన మహిళగా గుర్తించారు. వ్యభిచారం వృత్తిగా జీవనం సాగిస్తున్న ఆమె రెండు రోజుల క్రితం ఆమె గుంటూరుకు వచ్చి ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు. ముందుగా ఓ యువకుడు మాట్లాడుకుని తీసుకువెళ్లగా మరో ముగ్గురు రావడం, కొట్టి డబ్బు గుంజుకోవడంతో ఆమె కేకలు పెట్టిందని పోలీసులు అంటున్నారు. అయితే ఆమెపై అత్యాచారం జరిగిందా లేదా అనే దానిపై పోలీసులు విచారిస్తున్నారు. ఈ ఘటనపై పాత గుంటూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ఎస్పీ దృష్టి

● కొత్తపేట పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటన

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ఎస్పీ సతీష్‌కుమార్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ మేరకు బుధవారం ఆయన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కాలినడకన పర్యటిస్తూ ప్రధాన జంక్షన్లు, రోడ్ల మలుపులు, పార్కింగ్ ప్రదేశాలు, ఆటోలు, సిటీ బస్సులు, ఇతర వాహనాల నిలుపు ప్రదేశాలను పరిశీలించారు. రాధాకృష్ణ థియేటర్ సెంటర్, ఆర్ఎస్ బ్రదర్స్, టౌన్ చర్చ్, కింగ్ హోటల్ సెంటర్, ఎన్టీఆర్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, పూల మార్కెట్ వరకు సంబంధిత పోలీస్ అధికారులతో కలిసి ట్రాఫిక్ సరళిని పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యలకు గల కారణాలను కొత్తపేట సీఐ వీరయ్యచౌదరి, ఎస్పీ డీఎస్పీ సీతారామయ్య, పాత గుంటూరు సీఐ సోమయ్యల నుంచి ఎస్పీ తెలుసుకున్నారు.

శాంతినగర్ స్థల వివాదంలో ఇరువర్గాలపై కేసులు

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏటి అగ్రహారం శివారు శాంతినగర్లో స్థల వివాదంలో ఇరువర్గాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. గడిచిన కొంతకాలంగా శాంతినగర్‌లో సుమారు 510 గజాల స్థలం విషయం వివాదాస్పదమైంది. గతంలో ఓసారి వివాదం చోటు చేసుకోగా అప్పట్లో శ్రీనివాసరావుతోటకు చెందిన భాస్కర్ అనే వ్యక్తిపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఇదిలా ఉంటే మంగళవారం రాత్రి మరోసారి స్థలం వద్ద ఘర్షణ చోటు చేసుకుంది. దీనిపై శాంతినగర్ కు చెందిన తిరుపతమ్మ, ఏడుకొండలు, శ్రీనివాసరావుతోటకు చెందిన పెద్దమల్లు భూలక్ష్మి, భాస్కర్, దంపతులు ఇచ్చిన ఫిర్యాదులపై నగరంపాలెం పోలీసులు కేసులు నమోదు చేశారు.

అంజుమన్ ఆదాయం పశ్చిమ మైనార్టీలకూ కేటాయించాలి

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అంజుమన్ ఇస్లామియా సంస్థకు వచ్చే ఆదాయాన్ని కేవలం తూర్పు నియోజకవర్గానికే కాదని, పశ్చిమలో ఉన్న పేద మైనార్టీలకూ వెచ్చించాలని పశ్చిమ మైనార్టీ మహిళలు తెలిపారు. ఈ మేరకు బుధవారం పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవిని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా షేక్ సాబీరా మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో సుమారు 35 వేల మంది ముస్లిం సామాజిక వర్గానికి చెందినవారు నివసిస్తున్నారన్నారు. అంజుమన్ ఇస్లామియాపై రూ.కోట్లల్లో వచ్చే వార్షిక ఆదాయం వస్తుందని, అయితే పశ్చిమ నియోజకవర్గంలోని ముస్లింలకు న్యాయం జరగడం లేదన్నారు. ఈ కమిటీకి లాలాపేట పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న అంజుమన్ మసీదు కాంప్లెక్స్, అంజుమన్ షాదీ ఖానా కాంప్లెక్స్, పొన్నూరు రోడ్డులోని అంజుమన్ ఇస్లామియా స్కూల్ కాంప్లెక్స్, మంగళగిరిలో ఎన్నారై హాస్పిటల్ వెనుక సుమారు వంద ఎకరాలకు పైన పొలం ఉందన్నారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని జిల్లా పరిషత్ వెనుక వెయ్యి గజాల స్థలం, వికాస్ హాస్పిటల్ పక్కన ఈద్గా స్థలంలో నూతనంగా నిర్మించిన అన్వర్ కార్ పర్చేస్ వారు లీజుకు తీసుకొని చెల్లిస్తున్న లక్షలాది రూపాయలను కేవలం గుంటూరు తూర్పు నియోజకవర్గం పరిధిలో వారికే వాడుతున్నారన్నారు.

గుర్తు తెలియని యువకుడు మృతి




గుర్తు తెలియని యువకుడి మృతదేహం

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్ర జ్యోతి): లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోడిగుడ్ల సత్రం వద్ద గల సాంఘిక సంక్షేమ ఆఫీస్ సమీపంలో గుర్తు తెలియని యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సుమారు 30 ఏళ్ల వయసుగల వ్యక్తి మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

జిల్లాలో కొత్త తరహా మోసాలు జరుగుతోన్నాయి. ప్రజల అమాయకత్వాన్ని ఉపయోగించుకుంటూ చీటింగ్‌లకు పాల్పడే గ్యాంగ్‌లు పుట్టుకొస్తున్నాయి. ఇప్పటివరకు బ్యాంకులు/ఏటీఎంల వద్ద దొంగలు మాటు వేయడం, ద్విచక్ర వాహనాల డిక్కీల్లో దాచిన నగదుని దొంగిలిం చడం, టూవీలర్ పైనుంచి పడిపోతున్నట్లు నటిస్తూ పైకి లేపమని సహాయం కోరి పైజేబులో ఉన్న సెల్‌ఫోన్లు తస్కరించడం, నగలకు మెరుగు పెడతామంటూ ఇళ్ల వెంట వచ్చి మహిళలను మోస గిస్తున్న గ్యాంగులను చూశాం. తాజాగా అమాయక రైతుల ముసు గు ధరించి తక్కువ ధరకే నాణ్యమైన బీపీటీ బియ్యం ఇస్తామని చెప్పి మెల్లగా వారి మాయమాటలు నమ్మేలా చేసి తూకంలో కనికట్టు చేసి నిలువునా మోసగిస్తున్నారు.

రైతు వేషం.. కొలతల్లో మోసం

● ఇంటింటికి బియ్యం బస్తాలతో వస్తున్న గ్యాంగ్





సీసీ టీవీలో రికార్డు అయిన రైతుల ముసుగు ధరించిన చీటింగ్ గ్యాంగ్

- వరి పంట వేసి నష్టపోయామని కాళ్లు పట్టుకుంటూ నటన
- కేజీ రూ. 48కే బీపీటీ బియ్యం ఇచ్చేస్తామని కన్నీళ్ళు
- రైతులనే జాలితో కొనుగోలు చేస్తున్న అమాయక ప్రజలు
- తీరా బియ్యం కొలతతో కనికట్టు
- గుంటూరు పోలీసులకు బాధితుల ఫిర్యాదు

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని ఏటీ అగ్రహారం 9/2వ లైనులో తాజాగా వెలుగు చూసిన సంఘటనలో మూడు కుటుంబాలకు ఈ ఐదుగురు సభ్యుల గ్యాంగు 380 కేజీల బియ్యం అని చెప్పి డబ్బాతో కొలత వేసి ఇచ్చి దాదాపుగా రూ. 18 వేల నగదు తీసుకొని మెల్లగా జారుకొన్నది. రైతుల ముసుగులో ఉన్న వాళ్లు వెళ్లిన తర్వాత చూడగా తూకంలో సగానికి సగం వ్యత్యాసం కనిపించింది. దీంతో బాధితులు నగరంపాలెం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు వచ్చి సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలించి ముఠా తీసుకొచ్చిన వాహనాల నంబరు ప్లేట్లలో రిజిస్ట్రేషన్ నంబర్లు కనిపించడం లేదని చెప్పి వెళ్లిపోయారు.

ఏదైనా వస్తువు/సరుకులు తక్కువ ధరకు వస్తున్నాయంటే చాలామంది వాటిని కొనుగోలు చేసేందుకు తలొగ్గుతుంటారు. తాము కొనుగోలు చేయదలిచిన వస్తువుని ఎందుకు మార్కెట్ కంటే తక్కువ ధరకు ఇస్తున్నారన్న చిన్న విషయాన్ని అసలు పట్టించుకోరు. ఈ క్రమంలో మోసగాళ్లు వాళ్లని ఆలోచన కూడా చేసుకోనీయకుండా తమ విద్యని ప్రదర్శిస్తుంటారు. గుంటూరు నగరంలో విద్యావంతులు, ఉద్యోగస్తులు ఎక్కువగా ఉన్న ఏటీ అగ్రహారంలో దొంగలు తమ ప్రతాపాన్ని ప్రదర్శించారు. గత వారంలో తలపాగ, లుంగీలు ధరించి అచ్చం రైతుల వలే ఇంటింటికి వెళ్లారు. తాము తెనాలి పక్కన గ్రామం నుంచి వస్తున్నామని చెప్పి ఈ ఏడు వరి పంట సాగు చేసి నష్టపోయామని కళ్ల నీళ్లు పెట్టుకొన్నారు. తాము పండించిన ధాన్యాన్ని మిల్లుకు ఇచ్చి బియ్యం తీసుకొన్నామని, బయట మార్కెట్‌లో కేజీ రూ. 60 పైగానే ఉన్నాయని చెప్పారు. తాము కేవలం రూ. 48కే ఇస్తామని, బియ్యం నాణ్యత నంబరు. 1 అన్నారు. కావాలంటే వండి చూసుకోవాలని కొంత బియ్యం ఇచ్చి అక్కడే ఉన్నారు.

ఇది నిజమేనని నమ్మిన మూడు కుటుంబాలు బియ్యాన్ని అప్పటికప్పుడు నానపోసి వండాయి. అన్నం పొడిపొడి లాడటంతో క్వాలిటీ బియ్యం అని నమ్మి 25 కేజీలు చొప్పున ఇవ్వమన్నారు. అందుకు ఆ ఐదుగురు మోసగాళ్లు అయ్యా... అయ్యా మీ కాళ్ల పట్టుకొంటామంటూ వారి పాదాల మీద పడి తమ వద్ద 380 కేజీలున్నాయని... అంతా తీసుకోవాలని ప్రాధేయపడ్డారు. బియ్యాన్ని ఎలాంటి పురుగు పట్టదని నమ్మించారు. దాంతో ఒక వ్యక్తి 85 కేజీలు, మరోకొరు 165 కేజీలు, మరొకరు 130 కేజీల బియ్యాన్ని కొనుగోలు చేశా రు. ఆ సమయంలో వారిలో ఒకరి వద్ద నగదు లేకపోవడంతో మోసగాళ్లలో ఒక వ్య క్తి తన వాహనం ఎక్కించుకొని మరీ ఏటీఎం వద్దకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులు బియ్యంని వాళ్ల వెంట తెచ్చుకొన్న డబ్బాతో కొలత వేస్తూ కనికట్టు చేశారు. మోసగాళ్లు ఉన్నంత సేపు బాధితులు తూకంలో మోసగిస్తున్నారన్న విషయాన్ని గ్రహించలేకపోయారు. వాళ్లు వెళ్లిన కొన్ని గంటల తర్వాత బియ్యం బస్తాలు చిన్నవిగా ఉండటం చూసి కాటా వేయించగా సగానికి సగం వ్య త్యాసం వచ్చింది. మొత్తం మీద 190 కేజీలు మాత్రమే తూగా యి. తాము నిలువునా మోసపోయామని గ్రహించి ముగ్గురు బాధితులు నగరంపాలెం పోలీసుస్టేష న్‌లో ఫిర్యాదు చేయగా ఒక కానిస్టేబుల్‌ని సీఐ పంపించారు. ఆ కానిస్టేబు ల్ వచ్చి సీసీ టీవీ ఫుటేజ్‌ని పరిశీలించి వాహనాల నంబర్లు సరిగా కనిపించడం లేదని వెళ్లిపోయారు. ఇలాంటి సంఘటనలే జిల్లాలో మరికొన్ని చోట్ల జరిగినట్లు తెలిసింది.

అడ్మిషన్ల కోసం ఆరాటం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పెంపే లక్ష్యంగా అధ్యాపకులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 25 పైగా ఉండగా ప్లస్ టు కళాశాలలో మరో 30 వరకు ఉన్నాయి. ఆయా కళాశాలలో అడ్మిషన్లు కోసం ఈ ఏడాది జనవరి నుంచే అధ్యాపకులు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించారు .పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థిని విద్యార్థుల ఇంళ్ళ వద్దకు వెళ్లి వారి పూర్తి వివరాలుసేకరించారు. ప్రభుత్వ కళాశాలలో చేరాలని ఇక్కడ ఉన్న సౌకర్యాలు, బోధన తీరు, గత సంవత్సరాల్లో సాధించిన ఫలితాలు తదితర వివరాలు వివరిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు.

గుంటూరు (విద్య) ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థిని విద్యార్థులు దాదాపు 60 వేల మందికి పైగా ఉన్నారు. ఆయా విద్యార్థుల్లో అత్యధికమంది పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందినవారే. కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు ఫీజు రూ 30 వేల నుంచి రూ 1.25 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కళాశాలలో కార్పొరేట్ కళాశాలకు దీటుగా మెరుగైన శిక్షణ ఇచ్చి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు అధ్యాపకులు ప్రయత్నాలు చేస్తున్నారు.

అనేక సౌకర్యాలు

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలో అనేక సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోంది. ఇబ్బడి ముబ్బడిగా విద్యార్థులను చేర్చుకోకుండా తరగతికి 40 మంది ఉండేలా ఏర్పాటు చేస్తున్నారు .ఉచిత విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు మధ్యాహ్న భోజనం తో పాటు విద్యార్థులకు జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్, ఎంసెట్ పరీక్ష కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో అర్థ సంవత్సరం పరీక్షల పూర్తికాగానే ఆయా ప్రవేశ పరీక్షలకు విద్యార్థుల్ని తయారు చేసేలా అధ్యాపకులు ప్రత్యేక ప్రణా ళిక సిద్ధం చేసుకుని శిక్షణ అందిస్తున్నారు. గత ఏడాది జేఈఈ మెయిన్స్ కోసం ప్ర త్యేకంగా గుంటూరులోని ప్రభుత్వ బా లికల జూనియర్ కళాశాలలో నోడల్ సెంటర్‌గా రాష్ట్ర ప్రభుత్వం గుర్తిం చింది. దీని ద్వారా జిల్లాలోని అన్ని కళాశాలలకు జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందించేలా ఏర్పాటు చేస్తున్నారు.

ఇంటింటికీ ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు

విద్యార్థుల సమాచారంసేకరణ

పది ఫలితాలు రాగానే ఆన్‌లైన్ అడ్మిషన్లు



అడ్మిషన్ కోసం విద్యార్థులు ఇంటి వద్ద ప్రచారం నిర్వహిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు

పది విద్యార్థులకు బ్రిడ్జి కోర్స్

పదో తరగతి పరీక్షలు పూర్తి చేసిన విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బ్రిడ్జి కోర్స్ నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. జూనియర్ ఇంటర్ విద్యార్థులకు మారిన సిలబస్ ప్రకారం ఎన్సీఈఆర్టీ పాఠ్య పుస్తకాలు ఇంటర్ విద్యార్థులకు అందజేయనున్నారు. ఈ నేపథ్యంలో పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందించి ప్రత్యేకంగా బ్రిడ్జి కోర్స్ నిర్వహించనున్నారు. దీనివల్ల ఇంటర్లో సబ్జెక్టులు సులభంగా అర్థమయ్యే అవకాశం ఉందని చేబ్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు లక్ష్మణరావు ఆంధ్రజ్యోతికి వివరించారు. ప్రధానంగా గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ ,బోటనీ, సబ్జెక్టుల పాఠ్యపుస్తకాలు ఎన్సీఈఆర్టీ సిలబస్ ప్రకారం రూపొందించారు. ఇప్పటివరకు స్టేట్ సిలబస్లో చదివిన విద్యార్థినీ విద్యార్థులకు ఎన్సీఈఆర్టీ సిలబస్ పుస్తకాల సబ్జెక్టు అర్థమయ్యేలా బ్రిడ్జి కోర్సును రూపొందించారు. పదో తరగతి ఫలితాలు రాగానే ఆన్‌లైన్ అడ్మిషన్స్ నిర్వహించేలా ఇంటర్ బోర్డు ఏర్పాటు చేస్తోంది. విద్యార్థులు నేరుగా వెబ్ సైట్ వెళ్లి తమ అడ్మిషన్స్ ప్రక్రియ పూర్తి చేసుకునే అవకాశం కల్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పెంపే లక్ష్యంగా ఇంటర్ బోర్డు అధికారులు, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, సిబ్బంది సమష్టి కృషితో ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

అమరావతి రాజమార్గాలకు టెండర్లు

- రాజధానిలో ఈ - 13, ఈ - 15 రోడ్ల విస్తరణకు టెండర్లు
- కురగల్లు నుంచి మంగళగిరి మీదుగా ఎన్‌హెచ్ - 16 వరకు ఈ - 13 రోడ్డు
- ఈ 13 రోడ్డుకు రూ. 70 కోట్ల వ్యయంతో టెండర్లు
- నిడమర్రు నుంచి మంగళగిరి మీదుగా ఎన్‌హెచ్ - 16 వరకు ఈ - 15 రోడ్డు
- సీడ్ యాక్సెస్ రోడ్డుకు రైతుల నుంచి సహాయ నిరాకరణతో .. ప్రత్యామ్నాయ రాజమార్గాల అభివృద్ధి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) అమరావతి ప్రధాన రాజమార్గాలకు అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) టెండర్లు పిలిచింది. కురగల్లు నుంచి ఈ - 13, నిడమర్రు నుంచి ఈ - 15 రోడ్లను అమరావతి ప్రధాన రాజమార్గాలుగా పదహారవ నెంబర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ - 16)కు అనుసంధానించేందుకు టెండర్లు పిలిచింది. అమరావతి రాజధానికి ప్రధాన రాజమార్గంగా సీడ్ యాక్సెస్ రోడ్డును అభివృద్ధి చేసినప్పటికీ .. దీనిని ఎన్‌హెచ్ - 16 కు అనుసంధానం చేయటంలో సమస్యలు ఏర్పడ్డాయి. స్థానిక ఉండవల్లి రైతులు కొందరు భూములు ఇచ్చే విషయంలో అభ్యంతరాలు లేవనెత్తుతున్నారు. సహాయ నిరాకరణ చేపడుతున్నారు. దీంతో సీడ్ యాక్సెస్ రోడ్డు మొదటి ఫేజ్ పనులు మాత్రమే పూర్తయ్యాయి. రెండో ఫేజ్ పనులు ఉండవల్లి నుంచి మణిపాల్ హాస్పిటల్ మీదుగా కనకదుర్గ వారధి దిగువన ఎన్‌హెచ్ - 16 కు అనుసంధానించాల్సి ఉంది. ఇక్కడి ఉండవల్లి రైతుల సహాయ నిరాకరణ కారణంగా సీడ్ యాక్సెస్ రోడ్డు రెండో ఫేజ్ పనులు చేపట్టడం ఇప్పట్లో కష్టంగా ఉంది. సీడ్ యాక్సెస్ రోడ్డుకు భూములు తీసుకునే విషయంలో దాదాపుగా 40 కేసులపైగా న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నాయి. సీడ్ యాక్సెస్ రోడ్డును విస్తరించేందుకు ఇంతకు ముందు మంత్రి నారాయణ రైతుల ఇంటికి వెళ్ళి విజ్ఞప్తి చేశారు. కొంతమంది సహకరించినా.. మరికొందరు సహకరించలేదు. తమవి ఖరీదైన భూములు కాబట్టి ప్యాకేజీ పెంచాలని మరికొందరు డిమాండ్ చేశారు. ప్యాకేజీ అనేది ఎవరికైనా సమానంగా ఉండాలన్నది ప్రభుత్వ నిర్ణయం. కొంతమందికి ఎక్కువగా ఇచ్చి.. మరికొందరికి తక్కువగా ఇవ్వటం తప్పుడు సంకేతాలను ఇస్తుందన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం కూడా తాను అనుకున్న ప్రకారం కట్టుబడి ఉంది. ఎన్నో దఫాలు రైతులతో సంప్రదింపులు చేస్తున్నారు. ఇప్పటికీ సంప్రదింపులు జరుపుతూనే ఉన్నారు. రాజధానిలో రూ. 41 వేల కోట్ల మేర వివిధ ప్రాజెక్టుల పనులకు టెండర్లు పిలిచినప్పటికీ .. రాజధానికి రాజమార్గాల అంశం తేలటం లేదు. దీంతో ఏడీసీ అధికారులు ప్రత్యామ్నాయంగా ఈ - 13, ఈ - 15 రోడ్లను ఎన్‌హెచ్ - 16 కు అనుసంధానించి అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ - 13 రోడ్డును కురగల్లు నుంచి 7.29 కిలోమీటర్ల మేర మంగళగిరి మీదుగా ఎన్‌హెచ్ - 16కు అనుసంధానం చేయాలని నిర్ణయించారు. ఈ - 15 రోడ్డును నిడమర్రు నుంచి మంగళగిరి మీదుగా 3.52 కి లోమీటర్ల మేర ఎన్‌హెచ్ - 16 కు అనుసంధానించాలని నిర్ణయించారు. ఈ రెండు రోడ్లకు సంబంధించి ఏడీసీ అధికారులు తాజాగా టెండర్లు పిలిచిరు. ఈ - 13 రోడ్డును రూ. 70 కోట్ల వ్యయంతో వరదనీటి కాలువలతో సహా నిర్మించేందుకు టెండర్లు పిలవటం జరిగింది. ఈ - 15 రోడ్డును రూ. 384.76 కోట్ల వ్యయంతో టెండర్లు పిలవటం జరిగింది. ఈ రెండు ప్రధాన రాజమార్గాలను రెండేళ్ళలో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టనున్నారు.



చినగంజాం మండల పరిధిలో ఆక్వా సాగు

ఆక్వా.. ఆందోళన

- ట్రంప్ దెబ్బకు విలవిల
- పన్నుపోటుతో దిగజారిన రొయ్యల ధరలు
- భారీ నష్టాలు తప్పవని సాగుదారుల్లో భయం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఆక్వా రంగంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రూపంలో సుంకాల విపత్తు వచ్చిపడింది. దీంతో ఆక్వా సాగు చేయడంపై రైతులు పునరాలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. రొయ్య ఉత్పత్తుల ఎగుమతులపై అమెరికా 26 శాతం పన్నులు విధించడంతో ధరలు పతనమయ్యాయి. అసలే తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న ఆక్వా రంగం ట్రంప్ దెబ్బకు విలవిలలాడుతోంది. ఆక్వా రంగానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ప్రభుత్వం చెబుతున్నా రైతులు మాత్రం అమెరికా పన్నుల ప్రభావంతో నష్టాలు తప్పవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఆక్వా సాగుకు సంబంధించి ఏడాదికి రెండు నుంచి మూడు పంటలు తీస్తుంటారు. ప్రధానంగా జనవరి నుంచి మే, జూన్ నుంచి అక్టోబరు సీజన్ల మీదనే ఆక్వా రైతులు దృష్టి సారిస్తారు. అమెరికా విధించిన సుంకాల ప్రభావంతో రొయ్యల ధరల్లో ఇప్పటికే తిరోగమనం మొదలైంది. జూన్ నుంచి ప్రారంభమయ్యే సీజన్‌లో సాగుపై ఆక్వా రైతులు పునరాలోచనలో పడ్డారు. పూర్తిగా క్రాప్ హాలిడే తీసుకోకపోయినా సాగు విస్తీర్ణంలో మాత్రం గణనీయంగా కోత పడే సూచనలు ట్రంప్ పన్నుల ప్రభావం వల్ల కనబడుతోంది.

జిల్లాలో 22,500 ఎకరాల్లో రొయ్యల సాగు...

బాపట్ల జిల్లా వ్యాప్తంగా 22,500 ఎకరాల వరకు రొయ్యల సాగు జరుగుతోంది. దిగుబడుల్లో దాదాపు 90 శాతం విదేశాలకే ఎగుమతి అవుతున్నాయి. జిల్లా నుంచి విదేశాలకు ఎగుమతి అవుతున్న ఆక్వా ఉత్పత్తుల విలువ ఏడాదికి రూ.850 కోట్లు కాగా ఇందులో అమెరికా వాటా దాదాపు 45 శాతం వరకు ఉండడమే ఆక్వా రంగం కలవరపాటుకు కారణంగా ఉంది. రెండు వారాల క్రితం వరకు వంద కౌంట్ కిలో ధర రూ.250గా ఉండగా ప్రస్తుతం రూ.40 తగ్గుదల నమోదైంది. పెద్ద కౌంట్ రొయ్యలే ఎక్కువగా అమెరికాకు ఎగుమతి అవుతుంటాయి. 30,40 కౌంట్ రొయ్యల ధరల్లో కూడా పతనంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇదే పరిస్థితి కొనసాగితే...

ఈ పన్నుల నిర్ణయం వెలువడక ముందు ప్రభుత్వం తీసుకుంటున్న ఉద్దీపన చర్యల వల్ల జిల్లాలో ఆక్వా సాగు పెరుగుతుందనేది అంచనాగా ఉంది. కానీ ట్రంప్ నిర్ణయంతో ఆ అంచనాలు ఒక్కసారిగా తారుమారవడంతో పాటు ఏటా సాగయ్యే విస్తీర్ణంలోనే నాలుగు నుంచి ఐదు వేల ఎకరాల వరకు తగ్గుదల నమోదయ్యే అవకాశాలు కనబడుతున్నాయి. మున్ముందు రొయ్యల ధరలు మరింతగా క్షీణిస్తే ఆక్వా క్రాప్ హాలీడే దిశగా వెళ్లిన ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదనే అభిప్రాయాన్ని రైతాంగం వ్యక్తం చేస్తోంది. చిన్న, సన్నకారు రైతులపై పన్నుల ప్రభావం భారీగా ఉండొచ్చని తెలుస్తోంది. జిల్లాలో సాగు విస్తీర్ణంలో దాదాపు 75 శాతం వాటా చిన్న రైతులదే కావడం గమనార్హం. ఇదిలా ఉంటే జిల్లాలో ఆక్వా రంగంపైనే ఆధార పడి ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు పదివేల మంది వరకు ఉపాధి పొందుతున్నారు. ఆక్వా రంగం తిరోగమన బాట పడితే ఇందులో సగం మంది జీవనోపాధి ప్రశ్నార్థకం కానుంది. అయితే విదేశాలకు రొయ్యల ఎగుమతి విషయంలో ప్రత్యామ్నాయ మార్గాలపై కూడా దృష్టి పెట్టామని పాలకులు చెబుతున్నారు. ఆక్వా రైతులను ఆదుకోవడానికి ఇప్పటికే విద్యుత్ రాయితీని ప్రకటించామని, పరిస్థితులన బట్టి అవసరమైతే మరిన్ని ప్రోత్సాహక చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం భరోసా ఇస్తోంది.




ఆక్వా రైతుల పాలిట శాపమే..

అమెరికా విధించిన సుంకాలు కచ్చితంగా ఆక్వా రైతుల పాలిట శాపం లాంటిదే. 26 శాతం అని చెబుతున్నారు కానీ మొత్తంగా చూస్తే ఇది 27 శాతం వరకు పన్నులు పడే అవకాశం ఉంది. ఐదేళ్ల నుంచి అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నాం. కొంచెం గాడిన పడే సమయానికి ఇది వచ్చి పడింది. ప్రభుత్వం కేంద్ర పెద్దలతో చర్చలు జరిపి రైతులకు మేలు చేసే నిర్ణయం వచ్చే విధంగా చూడాలి

-బి. రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ సీఫుడ్ సప్లయిర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు

వెలగపూడిలో జోష్



వెలగపూడి గ్రామ ఏరియల్ వ్యూ

- సీఎం చంద్రబాబుది మా ఊరేనని సంబరాలు
- మా ఇంటి ముందు నుంచే వెళతారంటూ ఒకరు..
- మా ఇంటి పక్కనేనంటూ మరొకరు ఉబ్బితబ్బిబ్బు
- ఇంటి నిర్మాణంతో రాజధానికి కొండంత అండని ఆనందం

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరా వతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇల్లు కట్టుకునేందుకు సిద్ధమవడంతో అమరావతి ప్రజల ఆనందానికి హద్దులే లేకుండా పోయాయి. అందులోనూ వెలగపూడి వాసులైతే పట్టలేనంత ఆనందోత్సాహాల్లో మునిగి తేలుతున్నారు. ఎందుకంటే ఎప్పుడోగానీ కనిపించని ముఖ్యమంత్రి ఇక ఎప్పుడూ తమతోనే ఉంటారన్న ఆనందం వారిని నిలువనీయడం లేదు. 3,500 మంది జనాభా ఉండే వెయ్యి గడపల చిన్న ఊరులో ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం ఏర్పాటు చేసుకోనుండటంతో ఆ ఊరు వారందరికీ పట్టరాని సంతోషంగా ఉంది. చంద్రబాబు ఇంటి శంకుస్థాపన సందర్భంగా బుధవారం వెలగపూడిలో అదే కనిపించింది. చంద్రబాబు ప్రతి రోజూ మా ఇంటి ముందు నుంచే వెళ్లాలి.. చంద్రబాబు ఇంటి పక్కనే మా ఇల్లు.. చంద్రబాబు.. మేమూ ఒకే బజారు అని చెప్పుకోవచ్చు.. అంటూ ఎవరికి తోచిన రీతిలో వారు సంతోశాన్ని వ్యక్తం చేస్తున్నారు. తమ బంధువులకు, మిత్రులకు ఫోన్లు చేసి మరీ ఈ విషయాలు చెప్పుకుంటున్నారు.

రైతుల మాటల్లో నిబ్బరం..

గడిచిన ఐదేళ్లలో అమరాతి రైతులు నరకం అనుభవించారు. రాజధాని కోసం భూములివ్వడమే నేరంగా గత ప్రభుత్వం కక్ష సాధించింది. 1600 వందల రోజుల పాటు రైతులు నిత్యనరకం అనుభవించారు.ప్రభుత్వం మారి రైతులకు మంచి రోజులు వచ్చాయి. కానీ ఏదో ఒక మూల వారికి భయం పోలేదు.. మళ్లీ ఆ చీకటి రోజులు ఎక్కడ వస్తాయో.. తమను ఏం చేస్తాయోనన్న ఆందోళన వారిలో కనిపిస్తూనే ఉంది. ఆ ఆందోళనను పటాపంచలు చేసేలా చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో వారి మధ్యలోనే నివాసం ఉండేందుకు సిద్ధమవడం వారికి కొండంత ధైర్యాన్ని ఇచ్చింది.

● చరిత్రాత్మక కుటుంబం నుంచి స్థలం

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇంటి స్థలం అమ్మిన కుటుంబానికి ఆ ప్రాంతంలో గొప్ప చరిత్ర ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో వెలగపూడి సర్పంచ్‌గా కంచర్ల శాంతకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శాంతకుమారి మామ కంచర్ల అంజయ్య 1957లో 18 కిలోమీటర్ల కరకట్ట నిర్మాణానికి కృషి చేశారు. అప్పటి నుంచి ఆయన పేరు కరకట్ట అంజయ్యగా ఈ ప్రాంత ప్రజలు పిలుస్తారు. గతంలో రాష్ట్ర సచివాలయ శంకుస్థాపన సమయంలో కరకట్టకు అంజయ్య పేరు పెట్టాలని వారి కుటుంబసభ్యులు కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. కాగా శాంతకుమారి, ఆమె భర్త కంచర్ల సాంబశివరావు రాజధాని కోసం 25 ఎకరాలకు పైగా భూములు ఇచ్చి రిటర్నబుల్ ప్లాటును తీసుకున్నారు. ఆ ప్లాటు ఇప్పుడు సీఎం చంద్రబాబు నివాసానికి ఉపయోగపడడంపై వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు ఇంటికి దక్షిణంగా మా స్థలం



చంద్రబాబు కట్టుకునే ఇంటికి దక్షిణ వైపున నాకు 9000 గజాల ప్లాటు ఉంది. రైతుల పక్కనే సీఎం చంద్రబాబు ఇల్లు కట్టుకోవడం ఆనందంగా ఉంది. గత వైసీపీ ప్రభుత్వం అమరావతిని నిర్వీర్యం చేసింది. సీఎం వచ్చి అమరావతిని నిలబెట్టారు.

-కారుమంచి సూరిబాబు

చంద్రబాబు ఇంటికి ఆగ్నేయంగా మా ప్లాటు



చంద్రబాబు ఇంటికి దక్షిణ ఆగ్నేయం వైపు నాకు 630 గజాలు ప్లాటు ఉంది. మా గ్రామంలో చంద్రబాబు ఇంటికి శంకుస్థాపన చేయడం మా అందరికీ పండగలా ఉంది. గత 8 ఏళ్ల నుంచి వెలగపూడి రెవెన్యూలో కట్టిన రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర పాలన జరగడం సంతోషంగా ఉంది. ఇదే రెవెన్యూలో చంద్రబాబు ఇల్లు కట్టుకోవడం చాలా సంతోషం.

-నాయుడు నాగేశ్వరరావు

మా స్థలం కొనుక్కోవడం సంతోషం



ఇల్లు కట్టుకోవడానికి స్థలం కావాలి.. అమ్ముతారా అంటూ చంద్రబాబు నుంచి సమాచారం వచ్చింది. ఆ సమాచారం రాగానే ఎంతో సంతోషపడ్డాం. చంద్రబాబు విజన్‌ను నమ్మి రైతులు 33వేల ఎకరాలు ఇచ్చారు. అలాంటి నాయకుడికి మా స్థలం నచ్చడం సంతోషంగా ఉంది.

-కంచర్ల శాంతకుమారి, మాజీ సర్పంచ్

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

ఎమ్మెల్యే దృష్టికి వెల్లువెత్తిన ప్రజా సమస్యలు

● అర్జీలు పట్టుకొని క్యూ కట్టిన జనం

● సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్



ప్రజాదర్బార్‌లో అర్జీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తుళ్లూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ దృష్టికి ప్రజా సమస్యలు వెల్లువెత్తాయి. తుళ్లూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అధికారులతో కలసి ఎమ్మెల్యే ప్రజా దర్బార్ నిర్వహించారు. సమస్యలు చెపుకోవటానికి అర్జీలు పట్టుకొని జనం క్యూ కట్టారు. ఉదయం పది నుంచి 2 గంటల వరకు సాగిన ఈ కార్యక్రమంలో పలు రకాల సమస్యలను అర్జీల రూపంలో ఇచ్చి ఎమ్మెల్యేకి గోడు చెప్పుకున్నారు. సంబంధిత అధికారులకు అర్జీలను ఎమ్మెల్యే ఎండార్స్ చేస్తూ వెంటనే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైసీపీ ప్రభుత్వంలో కరెంట్ బిల్లు 300 యూనిట్లు దాటిందని తుళ్లూరు చెందిన ఓ మూగ చెవిటి యువకుడికి పింఛన్ ఇవ్వటం లేదని అర్జీ అందజేశారు. వెంటనే పరిశీలన చేసి ఏర్పాటు చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఇదే అంశం మీద పలు అర్జీలు ఎమ్మెల్యేకు అందజేశారు. అసైన్డ్ రైతులకు సీఆర్డీఏ నుంచి వస్తున్న సమస్యలను ఎమ్మెల్యేకు అందించారు. గతంలో అగ్నిప్రమాదంలో బీ పట్టాలు కాలిపోయాయని అధికాలు ఇవ్వమంటే మా దగ్గర రికార్డులు లేవని చెపుతున్నారని తుళ్లూరుకు చెందిన ఓ ఎస్సీ రైతు ఎమ్మెల్యేకు సమస్యను ఏకరువు పెట్టారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల సమస్యలు పేరుకుపోయాయని, ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు, టీడీపీ నేతలు పుట్టి రామచంద్రరావు, ధనేకుల సుబ్బారావు, మూల్పూరి నరేష్, కాటా అప్పారావు, బండ్ల పట్టాభిరామయ్య, మాజీ ఎంపీటీసీలు జొన్నలగడ్డ కిరణ్, మైనేని గిరిజా, నాయకులు మూల్పూరి శ్రీనివాసరావు, తరిగోపుల సాంబశివరావు, బండ్ల శ్రీనివాసరావు, జమ్ముల అనిల్, బెల్లంకొండ నరసింహారావు, అను మోలు సత్యనారాయణ, కోటేశ్వరరావు, ఎంపీడీవో కె.శిల్పా, తహసీల్దార్ బి.సుజాత, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య, జనసేన కన్వీనర్ విజయశేఖర్, యర్రగోపు నాగరాజు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

దుగ్గిరాల యార్డు నూతన పాలకవర్గం నియామకం

దుగ్గిరాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పసుపునకు ప్రసిద్ధి చెందిన దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు నూతన పాలకవర్గాన్ని బుధవారం ప్రకటించారు. ఛైర్మన్‌గా దుగ్గిరాలకు చెందిన ఉన్నం ఝాన్సీరాణి నియమితులైన విషయం తెలిసిందే. వైస్‌చైర్మన్‌గా పెదకొండూరుకు చెందిన సిరసాని రవి కిషోర్ (జనసేన), సభ్యులుగా నారిశెట్టి రోజా(జనసేన, ఈమని), కొంగర జోగేంద్ర ప్రసాద్ (బీజేపీ, దుగ్గిరాల), టీడీపీకి చెందిన కాసరనేని జస్వంత్ (రేవేంద్రపాడు), బుస్సా నాగరాజు (తుమ్మపూడి), లోకం శివకృష్ణ (చిలువూరు), నక్కబోయిన విజయకుమారి (ఈమని), యలవర్తి అంకమయ్య (శృంగారపురం), యార్లగడ్డ సౌజన్య (మంచికలపూడి), తాడిబోయిన పార్వతి (చుక్కపల్లివారిపాలెం), షేక్ ఆరిఫా (పెనుమూలి), ప్రసంగి గాయత్రి (గొడవర్రు), బాణావత్ శ్రీనునాయక్ (దుగ్గిరాల), కొండూరు కిరణ్(పెదపాలెం) నియమితులయ్యారు.

ఎర్రబాలెం మసీదు కమిటీ ఎన్నిక

మంగళగిరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం ఎర్రబాలెం బసవతారక నగర్‌లోని మసీద్-ఏ-మొహమ్మద్ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అబ్దుల్ నాజీమ్ ఎరఫ్, కార్యదర్శిగా నాయుడు నాగరాజు (ఇస్మాయిల్), ఉపాధ్యక్షుడిగా షేక్ షబాషీ, సహాయ కార్యదర్శిగా షేక్ షారూఖ్, కోశాధికారిగా ఇంతియాజ్ మొహమ్మద్, కార్యవర్గ సభ్యులుగా అబ్దుల్ అజీమ్, షేక్ నాగులాను ఎన్నుకున్నట్టు ప్రకటించారు.

ఉపాధి పనులు ప్రారంభం

ఫిరంగిపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములూరిపాడు గ్రామంలో 2025 - 26 సంవత్సరానికి మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులు టీడీపీ మండల అధ్యక్షుడు మండవ నరసింహారావు ప్రారంభించారని బుధవారం సర్పంచ్ కొరివి చిన ఆనంద్ తెలిపారు. గ్రామంలో రైతులకు, కూలీలకు ఉపయోగపడే విధంగా పంట కాలువలకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కటికల రామకోటేశ్వరరావు, పచ్చల రత్నరాజు, జెట్టి సుమన్, సయ్యద్ రబ్బానీ, సీతారామ రాజు, పిల్లి అంజనేయులు, గ్రామ పెద్దలు, మహిళలు, కూలీలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఫిరంగిపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేములూరిపాడు గ్రామంలో అమీనాబాద్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. సర్పంచ్ కొరివి చిన్న ఆనంద్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆ సందర్భంగా సర్పంచ్ ఆనంద్ మాట్లాడుతూ వేసవి కాలంలో బాటసార్లు, ప్రయాణికులు చలివేంద్రాన్ని ఉపయోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కటికల రామకోటేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు పచ్చల రత్నరాజు, సయ్యద్ రబ్బానీ, సయ్యద్ మహమ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

పసుపు క్వింటాల్‌కు రూ.15వేలు మద్దతు ధర ఇవ్వాలి

● రైతు సంఘం నేతల డిమాండ్

తాడేపల్లి (కుంచనపల్లి), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పసుపు రైతులను ఆదుకునే విధంగా మద్దతు ధర క్వింటాల్‌కు రూ.15 వేలు ఇవ్వాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఎంటీ ఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో పసుపు కల్లాల్లోని పంటను పరిశీలించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ పసుపు వేసిన రైతులు వారం వ్యవధిలో రెండు సార్లు అకాల వర్షాలు కురవడంతో ఆందోళనలో ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, అమ్మిశెట్టి రంగారావు, కొండా నాగిరెడ్డి, సామియేలు, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్వోలు, సూపర్‌వైజర్లకు శిక్షణ శిబిరం

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గంలోని బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లకు బుధవారం స్థానిక ఈద్గా కమ్యూనిటీ హాల్లో శిక్షణా శిబిరం నిర్వహించారు. నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఏ లక్ష్మీకుమారి బీఎల్వోలు, సూపర్‌వైజర్లకు పలు సూచనలు చేసి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి తహసీల్దారు శివరామయ్య, దుగ్గిరాల తహసీల్దారు సునీత, ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ కే శకుంతల, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దాతలు

పెదనందిపాడు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వరగాని పోలేరమ్మ తల్లి ఆలయం వద్ద బుధవారం జైసేవా చారిటబుల్ ట్రస్టు ఆర్థిక సాయంతో జెట్టి పెద్దన్న సహకారంతో చెన్నుపాటి డెవలపర్స్ అండ్ కన్‌స్ట్రక్షన్ అధినేత చెన్నుపాటి శివనాగేశ్వరరావు సంయుక్తంగా ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఆర్వో ప్లాంట్‌ను స్థానిక ఎంపీడీవో లక్ష్మీ ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పోపూరి వెంకపట్పయ్య, బండారు రాంబాబు, దిరిశాల శ్రీనివాసరావు, కొల్లా గోపి, పూర్ణచంద్రరరావు, పంచాయతీ కార్యదర్శి నాగయ్య పాల్గొన్నారు.

వంతెన నిర్మాణంతో తీరనున్న వెతలు

● మంచికలపూడి వద్ద డీఆర్‌బీసీ వాగుపై రూ.2.10కోట్లతో నిర్మాణానికి శంకుస్థాపన



డీఆర్‌బీసీ వాగుపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ జబీన్, జడ్పీటీసీ అరుణకుమారి తదితరులు

దుగ్గిరాల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వంతెన పనులు చేపట్టక నాలుగు దశాబ్దాలుగా మూడుగ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులు తొలగిపోనున్నాయని ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. మంచికలపూడి - కంఠంరాజు కొండూరు, పెనుమూలి గ్రామాలకు వెళ్లేమార్గంలో డీఆర్‌బీసీ వాగుపై ఉన్న వంతెన నిర్మాణానికి ఎంపీపీ బుధవారం శంకుస్థాపన చేశారు. జబీన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఏడెనిమిది నెలల కాలంలో మంత్రి లోకేశ్ ఆదేశాలతో దుగ్గిరాల మండలంలో రోడ్లకు, శిథిలావస్థకు చేరిన వంతెనల పనులకు మోక్షం లభిస్తోందన్నారు. ఇటీవల చిలువూరు ఎస్సీకాలనీ వద్ద డీఆర్‌బీసీ వాగుపై వంతెన పనులు కూడా పూర్తికావచ్చాయన్నారు. ప్రధానమంత్రి సడక్ యోజన నిధులు రూ.2.10 కోట్లతో చేపట్ట నున్న వంతెన నిర్మాణంతో ప్రసిద్ధి చెందిన శ్రీమంహంకాళీ అమ్మవారి ఆలయానికి వెళ్లే భక్తులకు సైతం ఇబ్బందులు తొలగనున్నాయి. జడ్పీటీసీ అరుణకుమారి, సర్పంచ్ యార్లగడ్డ చంద్ర దుర్గాభవాని, ఎంపీటీసీ మరీదు రాము, ఏమినేని కోటే శ్వరరావు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కు పొందవచ్చు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి గంగరాజు

తాడికొండ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందటానికి ఫారం-6 ద్వారా అర్జీని పెట్టుకోవచ్చునని నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎం గంగరాజు తెలిపారు. బుధవారం తాడికొండ తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ ఓటుహక్కు పొందటానికి అర్జీని ఓటర్ హెల్ప్‌లైన్, ఎన్వీఎస్‌పీ పోర్టల్ ద్వారా అప్లై చేసుకోవచ్చునని తెలిపారు. చనిపోయిన, శాశ్వతంగా ఇతర ప్రాంతాలు, రాష్ట్రాలకు వెళ్లిన వారి ఫారం-7 ద్వారా ఓటును తొలగించుకోవచ్చునని తెలిపారు. ఓటరు జాబితిలో ఓటరు పేరు, ఇంటి పేరు, గ్రామం పేరు, వీధి, పుట్టిన తేదీ, లింగం తప్పుగా నమోదైన ఫారం-8 ద్వారా సరి చేసుకోవచ్చునని తెలిపారు. ఒక డోర్ నెంబరుతో 10 మంది ఓట్లు లోపు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు మెహర్‌కుమార్, హరిబాబు, ప్రసాద్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ సయ్యద్ నల్లా, టీడీపీ, వైసీపీ, బీఎస్పీ, జనసేన పార్టీ, సీపీఎం, కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కేఎల్‌యూకి యూనివర్సిటి మలేషియా కేలంటాన్ ప్రతినిధి



డాక్టర్ మన్సూర్‌ను సత్కరిస్తున్న కేఎల్‌యూ డీన్ కిషోర్‌బాబు

తాడేపల్లి (వడ్డేశ్వరం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలంలోని వడ్డేశ్వరం కెఎల్ డీమ్డ్ యూనివర్సిటిని బుధవారం యూనివర్సిటి మలేషియా కేలంటాన్ ప్రతినిధి డాక్టర్ మహమ్మద్ బిన్ మన్సూర్ సందర్శించారు. ఈ సందర్భంగా యూనివర్సిటిలోని పరిశోధనా బృందంతో చర్చలు జరిపి బయోటెక్నాలజీ చదువుతున్న విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు గల పరిశోధనాశాలలో పరిశోధిస్తున్న వైజ్ఞానికులను కలిగియున్న కేఎల్‌యూతో పరస్పర సహకారం కోరుతూ తమ యాజమాన్యం తనను కేఎల్‌యూకు పంపారని డాక్టర్ మన్సూర్ అన్నారు. ఉమ్మడి పరిశోధనలు చేయాలని ఉభయులు సంకల్పించుకున్నామన్నారు. అనంతరం మన్సూర్‌ను అంతర్జాతీయ సంబంధాల డీన్ ఎం కిషోర్ బాబు సత్కరించారు. కార్యక్రమంలో బయోటెక్నాలజీ విభాగాధిపతి ప్రవీణ్‌కుమార్, ప్రొఫెసర్ అరీఫుల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరావతి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్‌నారాయణ

తాడికొండ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ తెలిపారు. బుధవారం గుంటూరు బీజేపీ జిల్లా కార్యాలయంలో తాడికొండ నియోజకవర్గ క్రియాశీలక సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి తాడికొండ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య అధ్యక్షత వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నా జయప్రకాష్ నారాయణ ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు భవిష్యత్తు అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కొత్తగా ఏర్పాటు చేసే ఔటర్ రింగ్ రోడ్డు, నూతన రైల్వే లైన్ నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం సహాయం అందిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతుందని తెలిపారు. ప్రతి కార్యకర్త గుర్తు పెట్టుకొని బీజేపీ చేస్తున్న పనులపై గ్రామగ్రామాన ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నేతలు నల్లూరి మధుకర్, చెరుకూరి తిరుపతిరావు, బిట్రా శివన్నారాయణ, కుమార్‌గౌడ్, సుబ్బారావు, నరేంద్ర, హేమసుందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల సహకారం

కాకుమాను, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకు రావాలని ఎంఈవో కేఏప్ కెన్నడీ అన్నారు. మండల పరిధిలోని కొండపాటూరు ఎంపీయుపీ పాఠశాలకు బుధవారం పాఠశాల పూర్వ విద్యార్థి గన్నపనేని రాఘవయ్య కుర్చీలు, వాటర్ క్యాన్‌లను ఎం ఈవో సమక్షంలో అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో కెన్నడీ మాట్లాడుతూ దాతలు అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థులు విద్యలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శీలం అంకారావు, ఉపాధ్యాయులు ప్రకాశరావు, పోతురాజు, ప్రమీలాదేవి, రవికుమార్, ఏడుకొండలు, రత్నథెరిస్సా, యమున, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావుకు సీపీఐ నేతల నివాళి

మంగళగిరి సిటీ, తాడేపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గాలిగోపురం వద్ద గల చంద్ర రాజేశ్వరరావు విగ్రహానికి సీపీఐ నేతలు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప కమ్యూనిస్టు రాజేశ్వరరావు అని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌రావు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, నేతలు జాలాది జాన్ బాబు, జవ్వాది సాంబశివరావు, పంతగాని మరియదాసు, వి.సాంబశివరావు, కంచర్ల కాశయ్య, ముసునూరు సుహాస్, తుడిమిల్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

గడ్డి లారీ ఢీకొని వృద్ధురాలి మృతి

తాడికొండ(పొన్నెకల్లు), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వైన్ షాపులో స్వీపర్‌గా పని చేస్తున్న వృద్ధురాలిని ఎండుగడ్డి లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలపరిధిలోని పొన్నెకల్లు గ్రామానికి చెందిన ఏ అన్నపూర్ణ(70) పొన్నెకల్లులోని వైన్ షాపులో స్వీపర్‌గా పనిచేస్తుంది. రోజు మాదిరిగానే షాపులో పనిచేయడానికి బయలుదేరిన వృద్ధురాలిని, ఎండుగడ్డి లోడ్‌తో గ్రామంలో నుంచి బైపాస్ రోడ్డుకు వస్తున్న లారీ ఢీకొట్టింది. లారీ వెనక చక్రాల కింద పడిన అన్నపూర్ణకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న సీఐ వాసు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. లారీ డ్రైవర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జోజిబాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



బూదాల దాస్ (ఫైల్ ఫొటో)

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో పాత జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తాడేపల్లి ముగ్గురోడ్డుకు చెందిన బూదాల దాస్ (43) మృతి చెందాడు. మంగళగిరి నుంచి తాడేపల్లి వస్తుండగా ఎదురుగా వేగంగా వచ్చిన ఆటో ఢీకొనడంతో దాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవన నిర్మాణ గుంతలో పడి చిన్నారుల మృతి

తాడేపల్లి (ఇప్పటం), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండల పరిధిలోని ఇప్పటం గ్రామంలో ఓ భవనం కోసం తవ్విన గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానిక రైల్వే గేటు సమీపంలో నిర్మాణం చేపడుతున్న ఓ అపార్ట్‌మెంట్ పనుల కోసం తవ్విన గుంతలో పడి ఆ ఇద్దరు చిన్నారులు నెల 7వ తేదీన మృతి చెందినట్టు తెలుస్తోంది. కాగా, జరిగిన ఘటనపై ఇంతవరకు తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు తెలిపారు. అపార్ట్‌మెంట్ నిర్మాణ నిమిత్తం కూలీ పనుల కోసం ప్రకాశం జిల్లా అద్దంకి నుంచి వచ్చిన ఓ కుటుంబానికి చెందిన వారని తెలిసింది. అపార్ట్‌మెంట్ నిర్మాణం వద్ద ఎటువంటి భద్రత, రక్షణ చర్యలు లేకపోవడంతో ఈ ఘటన జరగడంతో సదరు విషయాన్ని పోలీసులకు తెలపకుండా గోప్యంగా ఉంచినట్టు సమాచారం. గుట్టుచప్పుడు కాకుండా మృతుల తల్లిదండ్రులను బెదిరించి చిన్నారుల మృతదేహాలను వారి స్వస్థలానికి తరలించినట్టు సోషల్ మీడియాలో కథనాలు వచ్చాయి. వివరాలు తెలియాల్సి ఉంది.

పది క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

● ఒకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

తళ్లూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తాళ్లాయపాలెంలో రేషన్ బియ్యాన్ని తీసుకెళుతున్న వాహనాన్ని తుళ్లూరు పోలీసులు మంగళవారం రాత్రి 12 గంటల సమయంలో పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. సంఘటనలో వాహనాన్ని, డ్రైవర్ మొగిలి వెంకట్రావ్‌ను అదుపులోకి తీసుకున్నట్టు తుళ్లూరు పోలీసులు తెలిపారు. వెంకటపాలెంకి చెందిన బాలకృష్ణ అనే వ్యక్తి కిరాయి ఇస్తాను బియ్యాన్ని లోడు చేసుకురమ్మని చెప్పటంతో వచ్చానని పోలీసులకు డ్రైవర్ చెప్పాడు. పది క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

రైతులకు తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ



తైవాన్ స్ప్రేయర్లు అందిస్తున్న కొమ్మారెడ్డి కిరణ్, ఏవో శ్రీనివాసరావు

తాడేపల్లి (గుండిమెడ), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయశాఖ సబ్సిడీ ద్వారా రూ.27వేల విలువగల తైవాన్ స్ప్రేయర్లు రూ.10వేల సబ్సిడితో రూ.17వేలకే సబ్సిడీ ద్వారా బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని గుండిమెడ గ్రామంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కొమ్మారెడ్డి కిరణ్, వ్యవసాయశాఖ ఏవో శ్రీనివాసరావు చేతుల మీదుగా ఇద్దరు రైతులకు అందించారు. గుండిమెడకు చెందిన చినపాములు, అనుమోలు వెంకయ్యలకు స్ప్రేయర్లు అందజేశారు. కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు చిగురుపాటి సుబ్బారావు, నామతోటి రాంబాబు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పునఃప్రారంభం రోజునే పాఠ్యపుస్తకాల పంపిణీ

● సర్వశిక్షా కమ్యూనిటీ జిల్లా మొబలైజేషన్ అధికారి అనిల్

దుగ్గిరాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల పునఃప్రారంభం రోజునే పాఠ్యపుస్తకాలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు సర్వశిక్షా కమ్యూనిటీ జిల్లా మొబలైజేషన్ అధికారి దార్ల అనిల్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర(ఎస్ఆర్‌కెవీఎం-1) కార్యక్రమంలో భాగంగా దుగ్గిరాలలోని జడ్పీ బాలురోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌ను బుధవారం తనిఖీ చేశారు. ఒకటి నుంచి 10 తరగతుల విద్యార్థుల కోసం భద్రపరచిన పాఠ్య, నోటు పుస్తకాలు, మూడు జతల ఏకరూప దుస్తులు, బూట్లు, బ్యాగ్ తదితర వస్తువులను అందించనున్నారు. విద్యార్థులకు అందించాల్సి వస్తువుల భద్రత, పంపిణీ విషయంలో తీసుకోవాల్సి జాగ్రత్తలపై, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రథమ్ టీమ్ గుంటూరు జిల్లా కో-ఆర్డినేటర్ బెల్లంకొండ చక్రవర్తి, మన బడి.. మన భవిష్యత్తు ఏఈ సీహెచ్ నాగేంద్ర,ఎంఈవో కాజ లక్ష్మీనారా యణ, మండల విద్యావనరుల కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

నారా లోకేశ్‌కు జనసేన ధన్యవాదాలు

తాడేపల్లి (కొలనుకొండ), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పేదల దశాబ్దాల కల ను సాకారం చేస్తూ ఇళ్లకు పట్టాలు అందిస్తూ ఎన్నికల హామీ నెరవేరుస్తు న్న రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు జనసేన తరఫున ధన్యవాదాలు తెలుపుతు న్నామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సామల నాగేశ్వరరావు అన్నారు. ఓ వైపు సూపర్ సిక్స్ కార్యక్రమాలతోపాటు మంగళగిరిలో పార్క్‌లు, చెరువుల అభివృద్ధితోపాటు కల్యాణమండపాలు, జెమ్స్ అండ్ జ్యుయలరీ పార్క్ హ్యాండ్ లూమ్ ట్రస్ట్ ఏర్పాటు చేసి హామీలు నిలబెట్టుకుంటూ 100 పడకల ఆస్పత్రి ఏప్రిల్ 13న శంకుస్థాపన చేస్తున్నారని నాగేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ చిత్ర పటానికి కూటమి నేతలు కొలనుకొండలో పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్ర మంలో మండల జనసేన అధ్యక్షుడు సామల నాగేశ్వరరావు, కూటమి నేతలు లింగా శ్రీకాంత్, కంచర్ల రంగారావు, బళ్లా నాగరాజు, నూతక్కి నాగేశ్వరరావు, ఏలియా, తిరుపతిరావు, భూపతిరావు, శ్రీను, బాబు, అర్చన, తదితరులు పాల్గొన్నారు.

న్యాయ కళాశాల గుర్తింపు రద్దు చేయాలి



ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా చిత్తూరు జిల్లా పుత్తూరులో కొనసాగుతున్న కేఎంఆర్ న్యాయ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ ఏపీ బీసీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో బుధవారం మంగళగిరిలోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పర్చూరు నారాయణగౌడ్ మాట్లాడుతూ ఉన్నత విద్యామండలి, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నియమ నిబంధనలకు విరుద్ధంగా సదరు కళాశాలను స్థాపించారన్నారు. ఏపీ విద్యా చట్టం 1982, సెక్షన్ 20 ప్రకారం ఎలాంటి నిబంధనలను పాటించలేదన్నారు. ఆ కళాశాలలో ఒకే భవనంలో నాలుగు కోర్సులు నిర్వహిస్తూ విద్యా వ్యవస్థ విలువలకు తూట్లు పొడుస్తున్నారని, 2024-25 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు పొందిన లా విద్యార్థులను ఇతర కళాశాలలకు బదిలీ చేసి వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం నేతలు రాజశేఖర్, నక్కా గోపీచంద్, సాయి, డాక్టర్ సునీల్, సూర్య, రవీంద్ర, దుర్గారావు, అవోక్ సాయి, సురేంద్ర, రమేష్, పవన్‌కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యంపై అవగాహన



జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సంలో పాల్గొన్న ఎయిమ్స్ వైద్యులు, విద్యార్థులు

మంగళగిరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం సందర్భంగా గణపతి నగర్‌లోని ఇందిరానగర్ యూపీహెచ్‌సీలో బుధవారం ఎయిమ్స్ ఆస్పత్రి నర్సింగ్, గైనకాలజీ విభాగాల సహకారంతో తల్లిపాల ప్రాముఖ్యంపై అవగాహన కల్పించారు. ఎయిమ్స్ నర్సింగ్ విద్యార్థులు తల్లి పాలు బిడ్డకు ఎంత సురక్షితమో కళారూపం ద్వారా తెలియజేశారు. ఎయిమ్స్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ ధనస్సు మాట్లాడుతూ గర్భిణులు సంపూర్ణమైన పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యకేంద్రంలో గర్భిణిగా నమోదు చేసుకున్న వారికి రూ.3 వేలు, రెండో విడత టీకా నమోదు చేసుకున్న వారికి రూ2 వేల చొప్పున ఆధార్ అనుసంధానంతో పీఎంఎంవీవై పథకం ద్వారా బ్యాంకు ఖాతాలో జమవుతాయని చెప్పారు. రెండో కాన్పులో ఆడపిల్ల పుట్టి గర్భిణులు మొదటి విడతగా రూ.6 వేలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి పీ అనూష, ఎయిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ వందన, వైద్యులు ధనుష్, ఎం.ప్రియ, జీ.కాళేశ్వరి, అరవింద్ జోషి, సత్యసాయి ట్రస్ట్ డాక్టర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను రైతులు వినియోగించుకోవాలి

కాకుమాను, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నాయకుడు నల్లమోతు పూర్ణచంద్రరావు అన్నారు. కాకుమాను రైతు సేవా కేంద్రంలో బుధవారం రైతులకు సబ్సిడీకి తైవాన్ స్ప్రేయర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం పని చేస్తుందని వివరించారు. రైతుల సంక్షేమం కోసం రానున్న రోజుల్లో అనేక సంక్షేమ పథకాలు అమలవుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏవో కిరణ్మయి, టీడీపీ నాయకులు బత్తినేని వేణుగోపాలరావు, వట్టికూటి వెంకటేశ్వరరావు, చెన్నుపాటి రామకృష్ణ, ఆర్ కొండలరావు, ఆర్ఎస్‌కే సిబ్బంది, వీపీఏలు పాల్గొన్నారు.

● రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన పురుగుమందులను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఏవో కిరణ్మయి డీలర్‌లను హెచ్చరించారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

గోవుల సంరక్షణకు ఎండుగడ్డి వితరణ

తెనాలి రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదంలో గడ్డి వాములు దగ్ధమై పాడిరైతులు పశు పోషణకు ఇబ్బంది పడుతుండటంతో పలువురు దాతలు గడ్డిని వితరణగా అందజేశారు. స్టేషన్ మాష్టర్ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం ఇటీవల పినపాడు వద్ద జరిగిన అగ్నిప్రమాదంలో గడ్డి వాములు దగ్ధమయ్యాయి. దీంతో తమవంతు సాయం అందించాలని పలువురు దాతల నుంచి సేకరించి రూ.18వేలు విలువజేసే ట్రాక్టర్ ట్రక్కు ఎండుగడ్డిని పాడి రైతులకు అందించినట్లు స్టేషన్ మాష్టర్ వెంకటరమణ తెలిపారు.

108 టెక్నీషియన్ ఆత్మహత్యాయత్నం

తెనాలి రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): 108 డ్రైవర్ తనను వేధింపులకు గురిచేస్తున్నాడంటూ టెక్నీషియన్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం పట్టణంలో చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కఠెవరం గ్రామానికి చెందిన ప్రత్యూష గత కొంత కాలంగా 108 వాహనంలో టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో 108వాహనం డ్రైవర్‌గా పనిచేస్తున్న హుస్సేన్ తనను లైంగికంగా వేధిస్తున్నాడని ఆరోపించింది. అతడి ఆగడాలు తట్టుకోలేక నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపింది. తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాల వైద్యులు ఆమెను పరీక్షించి ప్రాణాపాయం లేదని వెల్లడించారు. ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య

తెనాలి రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ తెనాలి సెక్టర్ -1 సూపర్ వైజర్ సౌజన్య చెప్పారు. బుధవారం పట్టణంలోని 14వ వార్డులోని అంగన్ వాడీ కేంద్రం వద్ద పోషక పక్వాడాలో భాగంగా తల్లుల సమావేశం నిర్వహించారు. వెయ్యి రోజుల సంరక్షణ గురించి అవగాహన కల్పించారు. సమావేశంలో ఏఎన్ఎం, ఆశా, అంగన్ వాడీలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తెనాలి రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగలకుదురు సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ కోపల్లె-గుడివాడ ఫీడర్ మరమ్మతులు, చెట్ల తొలగింపు పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ వెంకట్రావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటవరకూ కోపల్లె, ఎడ్ల లింగయ్య కాలనీ మొదలగు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఓ ప్రకటనలో కోరారు.

మే 10న జాతీయ లోక్ అదాలత్

తెనాలి క్రైం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో తెనాలి కోర్టు ప్రాంగణంలో మే 10న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.ఇందిరా ప్రియదర్శిని తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో అన్ని రకాల సివిల్, భరణం, బ్యాంకు లావాదేవీల, మోటారు వాహన ప్రమాద, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు పరిష్కరించడం జరుగుతుందన్నారు. పలు కేసుల్లో కక్షిదారులు అనవసరపు భేషజాలతో ధనం, సమయం వృథా చేసుకుంటున్నారన్నారు. జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకుని కేసులు పరిష్కరించుకోవాలని న్యాయాధికారి కోరారు.

12 నుంచి సాంఘిక నాటికల పోటీలు ప్రారంభం

తెనాలి రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వైఎస్ రాజశేఖరరెడ్డి నాటక కళాపరిషత్ సాంఘిక నాటికల పోటీలు ఈ నెల 12న ప్రారంభం అవుతాయి. పోటీల కరపత్రాలను బుధవారం వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆవిష్కరించారు. రామలింగేశ్వరపేటలోని ఆడిటోరియం(తడికల మిల్లు)లో ఏడు రోజుల పాటు నాటికలు ప్రదర్శిస్తారు. కార్యక్రమంలో అక్కిదాసు కిరణ్, ఆరాధ్యుల కన్నా, లక్ష్మణశాస్త్రి, కోటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వ్యర్థాలను తొలగించండి: మునిసిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక 15వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్లపై ఉన్న వ్యర్థాలను గమనించి అధికారులను తక్షణమే తొలగించి డంపింగ్ యార్డుకు తరలించాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని 19, 29వ వార్డులలో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పలువురు మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు నిర్వహించారు. బుధవారం స్థానిక నాజరుపేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమంలో ఎస్‌వీ యోగ సభ్యుడు తలారి నరసింహులు జ్ఞాపకార్థం వారి భార్య బాలామణి, కుమారుడు కోడలు మహేందర్, లావణ్య, కుటుంబ సభ్యుల సహకారంతో ఆశ్రమంలోని వృద్ధుకు పండ్లను పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌వీ యోగా కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య, యోగా సభ్యులు పాల్గొన్నారు.

అధ్వానంగా శలపాడు ఊర చెరువు



గుర్రపు డెక్కతో అధ్వానంగా ఉన్న శలపాడు ఊర చెరువు

● గుర్రపుడెక్క, వ్యర్థ జలాలతో కలుషితం
● చుట్టూ నివాస గృహాలు, పాఠశాల, పంచాయతీ కార్యాలయం
● దుర్గంధం, విష పురుగులతో సమీప నివాసితుల సతమతం
● శుభ్రం చేయాలని గ్రామస్థుల వేడుకోలు



చెరువుని ఆనుకుని ఉన్న ప్రాథమిక స్కూల్

చేబ్రోలు (పొన్నూరు టౌన్), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శలపాడు గ్రామం నడిబొడ్డున ఉన్న ఊర చెరువు ఆలనాపాలన లేక అధ్వానంగా తయారైంది. అధికారుల నిర్లక్ష్యంతో ఒకప్పుడు పంచాయతీకి అదనపు ఆదాయం తెచ్చేలా చేపలు పెంచే చెరువు కాస్త తుంగ, గ్రామం నుండి వచ్చే మురుగు నీరుతో కలుషితమై నేడు అనారోగ్య సమస్యలకు నిలయంగా మారింది. చెరువు వెంబడి వందలాది కుటుంబాలు నివాసముంటుండగా దానికి ఆనుకుని ప్రాథమిక పాఠశాల, పంచాయతీ కార్యాలయం ఉన్నాయి. గతంలో ఊర చెరువులో మంచినీటితో ఆహ్లాదకరంగా ఉండేది. కాలక్రమేణా చెరువు నిర్వహణను వదిలి వేయనుండటంతో ప్రస్తుతం చెరువునిండా గుర్రపుడెక్క, ఇతర గడ్డి జాతి మొక్కలతో నిండి, మురుగు చేరి దుర్గంధం వెదజల్లుతూ దోమలకు, విషసర్పాలకు నిలయంగా మారింది. దీనితో పరిసరాల ప్రజలు అల్లాడిపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో పలు కార్యక్రమాలు చేపడుతుంటే శలపాడు గ్రామంలో మాత్రం నడిబొడ్డున పంచాయతీ కార్యాలయానికి ఆనుకుని ఉన్న చెరువు అధ్వానంగా ఉన్నా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవటంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల్లోకి విషపురుగులు వస్తుండటంపై గ్రామస్థులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు కలుషితమౌతున్న ఊర చెరువు సమస్యపై దృష్టిపెట్టి దానిలో పేరుకుపోయిన వ్యర్థాలు తొలగించి సురక్షిత చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఘనంగా ఏఎన్‌యూ మహోత్సవం 2025



ప్రసంగిస్తున్న ఈగల్ ఎస్పీ నగేష్ బాబు, పక్కన వీసీ తదితరులు

పెదకాకాని, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఏఎన్‌యూ మహోత్సవం 2025 కార్యక్రమం బుధవారం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ఎరాడికేషన్ ఆన్ డ్రగ్స్ అనే అంశంపై ఇంజనీరింగ్ విద్యార్థినీ, విద్యార్థులు ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈగల్ టీం సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కే.నగేష్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డ్రగ్స్ నిర్మూలించడానికి ఈగల్ టీంను ఏర్పాటు చేశారన్నారు. గౌరవ ఏపీ ఎడ్యుకేషన్ మినిస్టర్ నారా లోకేశ్ అన్ని విశ్వవిద్యాలయాలలో డ్రగ్స్‌ను నిర్మూలించడానికి ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేశారన్నారు. ఏఎన్‌యూ తాత్కాలిక ఉపకులపతి కంచర్ల గంగాధరరావు మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ జోలికి వెళ్లి జీవితాలను, భవిష్యత్తును నాశనం చేసుకోవదన్నారు. రెక్టార్ ఆచార్య రత్న షీలామణి విద్యార్థులు చేపట్టిన అవగాహన కార్యక్రమాలను ప్రశంసించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి సింహాచలం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కామర్స్ లా కళాశాల ప్రాచార్యులు ఆచార్య ఎమ్ సురేష్ కుమార్‌లు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీఎస్ ఆర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎమ్ వెంకటరమణ, కళాశాల సహాయ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.గోపికృష్ణ, డి.చంద్రమౌళి కన్వీనర్ డాక్టర్ సీహెచ్ రవికుమార్ కో కన్వీనర్స్ డాక్టర్ యూ సతీష్, డాక్టర్ కె.చైతన్య డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ బి. పూర్ణచంద్ర శేఖర్, డాక్టర్ యుగంధర్, డాక్టర్ సునీత, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎండీ తౌసిఫ్ అహమ్మద్ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పెదకాకాని, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే నరేంద్ర బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఆయా గ్రామాల్లో అభివృద్ధి సంక్షేమ పథకాలను పరిశీలించారు. పెదకాకాని మండలం వెనిగండ్లలోని వాటర్ ప్లాంట్‌ను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా వెనిగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హాస్పిటల్ ఆవరణలో రోడ్లు భవనాల శాఖ రూ.50 లక్షలు నిధులుతో హాస్పిటల్‌కు నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వెనిగండ్లలో 10 లక్షలు గ్రామపంచాయతీ నిధులులతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. వెనిగండ్ల హిందూ, ముస్లింల శ్మశాన వాటికలో 30లక్షల మండల పరిషత్ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. పెదకాకాని కొత్త నగరపాలెంలో రూ.10లక్షలు గ్రామపంచాయతీ నిధులు, 2.50 లక్షలు మండల పరిషత్ నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ముద్రబోయిన సూరిబాబు నిర్మించిన గాజు పూస భవనాన్ని ప్రారంభించారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో పెదకాకాని మండలం డ్వాక్రా మహిళలకు 128 మందికి వ్యక్తిగత రుణాలు1 కోటి 66 లక్షలు అందజేశారు. పెదకాకాని మండలం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మొత్తం 16 లక్షలు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానం (కాకాని గుడి)లో జరిగే నిత్య అన్నదానానికి పెదకాకాని తెలుగుదేశం పార్టీ ప్రధానకార్యదర్శి బోయపాటి రామ్ మోహన్‌రావు తల్లిదండ్రులు బోయపాటి వెంకట్రావు, లలిత కుమారిల జ్ఞాపకార్థం రూ.లక్ష రూపాయలు విరాళాన్ని బుధవారం పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యుడు నరేంద్రకుమార్ చేతులు మీదుగా ఆలయ కార్యనిర్వహణ అధికారికి అందజేశారు.

ఆర్వో వాటర్ ప్లాంటుల ప్రారంభం

పెదకాకాని శివాలయంలో భక్తుల కోసం దివీస్ లేబరేటరీస్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన రెండు ఆర్వో ప్లాంట్లనుధూళిపాళ్ల నరేంద్రకుమార్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో దివీస్ లేబరేటరీస్ ప్రతినిధులు జి.నగేష్, సి.హెచ్. శ్రీనివాసులు, ఆలయ ఉపకమిషనరు గోగినేని లీలాకుమార్‌లు పాల్గొన్నారు.



మొక్కు తీర్చుకుంటున్న అభిమానులతో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

ఆలపాటి విజయంపై మొక్కులు తీర్చుకున్న అభిమానులు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ శాసన మండలి ఎన్నికల్లో విజయం సాధించాలని పార్టీ అభిమానులు గంగానమ్మపేటలో మొక్కుకున్నారు. ఆయన ఘన విజయం సాధించడంతో శుక్రవారం మొక్కులు తీర్చుకున్నారు. ప్రభ కట్టుకుని వచ్చి ఆలయంలో పూజలు చేసి మొక్కులు తీర్చారు. ఎమ్మెల్సీ ఆలపాటి మాట్లాడుతూ, అభిమానుల కృషి మరువలేనన్నారు. తన విజయం కోసం ఎంతోమంది అభిమానులు, కార్యకర్తలు నిరంతరం పని చేశారని అన్నారు. కౌన్సిలర్ తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, లక్ష్మీనారాయణ, సురేష్, అంజిబాబు, అర్బన్ బ్యాంకు చైర్మన్ హరిప్రసాద్, మునిసిపల్ మాజీ చైర్మన్ వెంకట్రావు, రవిచంద్, సుబ్బారావు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

సమగ్ర శిక్షా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి అనిల్

కొల్లిపర, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా సమగ్ర శిక్షా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి దార్ల అనిల్ అన్నారు. బుధవారం మండల కేంద్రం కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల స్టాక్‌పాయింట్‌ను ఆయన విద్యాశాఖాధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థినీ, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు మూడు జతల ఏకరూప దుస్తులు, బూట్లు, బ్యాగ్‌లు తదితర వస్తువులు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందని వాటన్నింటిని ఏర్పాటు చేయటానికి కొల్లిపర హైస్కూల్‌లో స్టాక్‌పాయింట్‌ను నిర్ణయించడం జరిగిందన్నారు. స్టాక్‌పాయింట్‌ను పరిశీలించిన వారిలో జిల్లా కో -ఆర్డినేటర్ బెల్లంకొండ చక్రవర్తి, ఎంఈవోలు సాల్మన్‌రాజు, ఝాన్సీలత, ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు, మండల విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కసుకర్రు గ్రామంలోని వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకాలు నిర్వహించి లక్ష తులసీ దళాల పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలను సందర్శించిన కాయకల్ప బృందం

తెనాలి రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి భరోసాగా తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల సేవలందిస్తుందని కాయకల్ప బృంద సభ్యులు డాక్టర్ నిర్మలాగౌరీ చెప్పారు. బుధవారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో కాయకల్ప బృందసభ్యులు పర్యటించారు. వార్డుల్లో శానిటేషన్, రోగులకు అందుతున్న వైద్యసేవలు, యాంటిబయాటిక్ వాడకం, గర్భిణుల వార్డులో వైద్యులు అందిస్తున్న సేవలు, ఆపరేషన్ థియేటర్ల మెయింటినెన్స్ వంటివాటిని పరిశీలించారు. అనంతరం బృందసభ్యులు మాట్లాడుతూ వైద్యశాల సేవలు బాగున్నాయని తెలిపారు. డాక్టర్ హెప్సీగ్రేస్, సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి, పలువురు కయాకల్ప బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులతో భూమి సారవంతం

● శాస్త్రవేత్త డాక్టర్ వెంకటలక్ష్మి

తెనాలిరూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వేసవి దుక్కులతో పంటభూములు సారవంతమవుతాయని దీంతో సకాలంలో విత్తనాలు మొలకలు వస్తాయని ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్ర వేత్త డాక్టర్ వెంకటలక్ష్మి చెప్పారు. బుధవారం మండలంలోని కొలకలూరులో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో బాపట్ల కళాశాల విద్యార్థులు వేసవి దుక్కులు - ఆవశ్యకతపై గ్రామంలో ర్యాలీగా నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ సంధ్యారాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఇంచార్జ్ డాక్టర్ స్వర్ణలత గ్రామానికి చెందిన పలువురు రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి: ఈడీ

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి గ్రామ పంచాయతీలు సంపద సృష్టించాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బొంతు అర్జునరావు అన్నారు. బుధవారం ఏడీ అర్జునరావు చేబ్రోలు గ్రామ పంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా తాగునీటి నిర్వహణ, మురుగు నీటి పారుదల వ్యవస్థలను పరిశీలించారు. చేబ్రోలులో చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రాన్ని పరిశీలించి ఘన వ్యర్థాల నిర్వహణ, తడిచెత్త నుంచి వానపాముల ఎరువు తయారీ చేసే విధానాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అర్జునరావు మాట్లాడుతూ గ్రామాలలో వ్యర్థాలను వేరువేరుగా సేకరించి వాటిని విభజించటం ద్వారా పంచాయతీలకు ఆదాయం సృష్టించుకోవచ్చని అన్నారు. చెత్తను తిరిగి వినియోగించుకోవడం ద్వారా సంపద సృష్టితో పాటు పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. ప్రతి గ్రామంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌లు పూర్తి స్థాయిలో పని చేసేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి, ఈవోపీఆర్డీ ఉషారాణి, మల్లికార్జునరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చండ్ర రాజేశ్వరరావుకు ఘన నివాళి

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం కమ్యూనిస్టు నాయకుడు లెనిన్ అవార్డు గ్రహీత చండ్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం రాజేశ్వరరావు చేసిన స్వతంత్ర్య ఉద్యమ పోరాటాలు, భూ పోరాటాలు, కమ్యూనిస్టు పోరాటాల గురించి మననం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, ట్రేడ్ యూనియన్ నాయకులు నరసింహారావు, రసూల్, జాన్, కుమ్మరిగుంట సామ్యేల్, కోట నరసింహారావు, షేక్ అజీమ్ పాల్గొన్నారు.

దివ్యాంగుడిపై దాడి కేసులో ఆటోడ్రైవర్ అరెస్టు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్ నుంచి ఇంటికి వెళ్లెందుకు ఆటోఎక్కిన దివ్యాంగుడిపై దాడిచేసి అతడి వద్ద నున్న సెల్‌ఫోన్ నగదును అపహరించిన కేసులో నిందుతులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ జనార్ధనరావు చెప్పారు. బుధవారం స్థానిక త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ జనార్ధనరావు సీఐ రమేష్ బాబుతో కలసి నిందితుల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా డీఎస్పీ జనార్ధనరావు మాట్లాడుతూ అంగలకుదురు గ్రామానికి చెందిన దివ్యాంగుడు చుండి సుధాకరరావుపై ఈ నెల 5వ తేదీన రైల్వేస్టేషన్ వద్ద ఆటో ఎక్కగా ఆటోడ్రైవర్ అతని పక్కన ఉన్న మరో వ్యక్తి కలసి స్థానిక ఎరువులకొట్ల బజార్ సమీపంలో దాడిచేసి సెల్‌ఫోన్ రూ.1000లు అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి చినరావూరుకు చెందిన నంటూరి గణేష్, గుత్తికొండ నాగ రాకేష్‌లు సుధాకరరావుపై దాడి చేసినట్లు గుర్తించారు. వారిని బుధవారం స్థానిక వహాబ్ చౌక్‌లో ఉండగా అదుపులోకి తీసుకున్నారు. బాధితుడి నుంచి చోరీ చేసిన సెల్‌ఫోన్, నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నేరానికి వినియోగించిన ఆటోను స్వాధీనం చేసుకొని, నిందుతులను కోర్టు ఎదుట హాజరు పరుస్తున్నట్టు డీఎస్పీ జనార్ధనరావు పేర్కొన్నారు. కేసును చేధించిన సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ ప్రకాష్‌రావులను అభినందించారు.

పన్నులను నూరు శాతం వసూలు చేయాలి

డీఎల్‌పీవో స్వరూపరాణి



నూరుశాతం ఇంటి పన్నులు వసూలు చేసిన పంచాయతీ కార్యదర్శిని అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కొల్లిపర, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నులను నూటికి నూరు శాతం వసూళ్ళు చేయాలని డీఎల్‌పీవో స్వరూపరాణి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూటికి నూరు శాతం ఇంటి పన్నులు వసూళ్ళు చేసిన పంచాయతీ కార్యదర్శులు శంకరయ్య, పద్మావతిదేవి, నాగ సుందరి, కె.లక్ష్మి, బి.మాధురి, నాగార్జున, కె.హరిలను ఎంపీపీ భీమవరపు పద్మావతి, ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపీఆర్డీ భార్గవ్‌తో కలిసి ఆమె సన్మానించారు. ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ మండలంలోని 20 గ్రామాల్లో కోటి 66 లక్షల రూపాయలు ఇంటి పన్నులను వసూలు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు కోటి 45లక్షల రూపాయలు వసూలు అయినట్లు పేర్కొన్నారు. మార్చి 31వ తేదీ నాటికి ఎనిమిది పంచాయతీలు నూటికి నూరు శాతం ఇంటి పన్నులు వసూళ్ల అయినట్లు తెలిపారు. పదిరోజుల్లో మిగిలిన పంచాయతీ కార్యదర్శులు కూడా నూరు శాతం పన్నుల వసూలుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి ప్రతాప్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ముగింపు పూజల్లో పాల్గొన్న భక్తులు

అప్పలస్వామి ఆలయంలో ముగిసిన నవమి ఉత్సవాలు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మారీసుపేటలోని అప్పలస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. స్వామి వారికి ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవలు ఘనంగా జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ధర్మకర్తలు నారాయణస్వామి, శివానంద కుమార్, ఆంజనేయప్రసాద్, సుబ్రహ్మణ్యశర్మ, కుమార్‌శర్మ పాల్గొన్నారు.

చలువ చొప్పరంపై ఊరేగిన చెన్నకేశవస్వామి



పూజలందుకుంటున్న చెన్నకేశవస్వామి

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీచెన్నకేశవ స్వామి చలువ చొప్పరంపై విహరించారు. మండల పరిధిలోని ములుకుదురులోని శ్రీభూలీల సమతే చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం నిత్య హోమం జరిపారు. ప్రత్యేక పూజల అనంతరం సాయంత్రం స్వామివారి ఉత్సవ మూర్తులను చలువ చొప్పరం వాహనంపై ప్రతిష్టించి గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవటం దుర్మార్గం

● రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివసాంబిరెడ్డి

తెనాలిరూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అకాలవర్షాలు కురుస్తూ చేతికొచ్చిన జొన్న పంటలు తడుస్తూ రైతులు ఆందోళన చెందుతుంటే వారిని ఆదుకునేలా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం దుర్మార్గమని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి విమర్శించారు. బుధవారం నేలపాడులో జొన్న రైతులను కలిసి ఆయన మాట్లాడారు. అనంతరం శివసాంబిరెడ్డి మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా అక్కడక్కడ అడపాదడపా కురుస్తున్న వర్షాలకు కోతకోసిన జొన్న భద్రపరిచే వీలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. దళారులు నల్లకాటు పేరుతో బస్తాకు రూ.800 తక్కువ ధరలకు వాటిని కొనుగోలు చేసేందుకు వస్తున్నారన్నారు. వర్షానికి పంటలు పూర్తిగా నష్టపోవడం కంటే గిట్టుబాటు కాకున్నా మరో మార్గం లేని పరిస్థితుల్లో వారికే అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకునేలా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు.